Chand Tasveere Seerat ke Album Se
(Telugu)

ప్రవక్త (స) జీవితం

ఆదర్శ దృశ్య మాలిక

మూలం
ఖుర్రం మురాద్

అనువాదం
ఉమ్మైమ సిద్దీఖ

ముందుమాట

జనవరి 1982లో నాకు మొదటిసారి గుండెనొప్పి వచ్చింది. ఈ కఠినమైన ఘట్టాన్ని దాటిన తర్వాత, ఆగస్టులో గ్లాస్గోలో జరిగిన ఇస్లామిక్ మిషన్ వార్షిక సమావేశంలో ముగింపు ప్రసంగం కొరకు నన్ను ఆహ్వానించారు. 'సందేశ ప్రచారం' అనే అంశంపై ప్రసంగం ఏ విధానంలో కొనసాగించాలో రాత్రి సమయంలో ఒంటరిగా కూర్చొని ఆలోచించసాగాను. నా అధ్యయనం, నా అనుభవాల ద్వారా నేను తెలుసుకున్న విషయాలను సింహావలోకనం చేసుకున్నాను. మరుసటి రోజు ప్రసంగం అర్థగంట పాటు కొనసాగి సంక్షిప్తంగా ముగిసింది. ఇది కాన్ఫరెన్స్ ముగింపు ప్రసంగం. ఇస్లామీయ ఉద్యమంతో ఎలాంటి సంబంధమూ లేని ఒక ధార్మిక పండితుడు ముఫ్తీ మఖ్బూల్ అహ్మద్ సాహెబ్ ఈ ప్రసంగ సారాన్ని ఇలా తెలియపర్చారు.

> **"ముద్రవేయబడిన, సుమధుర మధువు వారికి ఇవ్వబడుతుంది. దానికి దానిపై కస్తూరి ముద్ర వేయబడి ఉంటుంది. ఇతరుల్ని మించిపోవాలని కోరుకొనేవారు దీన్ని పొందే విషయంలో మించిపోవటానికి కృషిచేయాలి. *(అల్‌ముతఫ్ఫిఫీన్ 83 : 26)***

దీని తర్వాత 1983, లాహోర్‌లో ఇస్లామీ జమీఅతె తులబ పాకిస్తాన్ వార్షిక సమావేశం ప్రారంభ ప్రసంగంలో నేను 'ఉస్వయే హసన (ఉత్తమ నమూనా)' అన్న అంశంపై ప్రసంగించాను. ఈ ప్రసంగంలో నా అధ్యయనం, అనుభవాల సారాన్ని మరింత విస్తారంగా ప్రస్తావించాను. ఈ ప్రసంగం లాహోర్‌లో ముద్రించబడింది. దీని తర్వాత తహ్‌రీకె ఇస్లామీ పాకిస్తాన్ మహిళా విభాగం వారు దీన్ని ముద్రించి ఎక్కువ సంఖ్యలో పంపిణీ చేశారు.

ఆ ప్రసంగంలోని భాష, సంభాషణా క్రమాలతో నా మనస్సు సంతృప్తి చెందలేదు. అందువలన ఎప్పుడైనా అవకాశం లభిస్తే దానిపై పునఃసమీక్ష జరపాలని భావించాను. మార్చి 1986లో కరాచీ వెళ్లినప్పుడు ఇస్లామీ జమీఅతె తులబ దీన్ని ముద్రించుకునేందుకు పునఃసమీక్ష జరపాల్సిందిగా నా ప్రియసోదరుడు షాహిద్ హాష్మి నన్ను కోరారు. కరాచీ నుండి తిరిగి వచ్చిన తర్వాత పునఃసమీక్ష జరిపేందుకు కూర్చుంటే ఈ రూపంలో ఒక నూతనం పుస్తకం తయారైంది.

ఫలిల్లాహిల్ హమ్ద్ –ఇది దాని కంటే ఎక్కువ లాభదాయకం గాను, అల్లాహ్ సన్నిధిలో స్వీకారయోగ్యం గాను, పరలోకంలో మోక్షం కొరకు సహాయకారి గాను తోడ్పడగలదని ఆశిస్తున్నాను.

ఈ రోజు ముస్లిం సమాజం జీవితాలను పునరుజ్జీవింపచేయడానికి, ఇస్లామీయ ఉద్యమాన్ని జయప్రదం చేయడానికి అవసరమైన ఉత్తమ నమూనాలో సందేశ ప్రచారాన్ని తీసుకుని నిలబడాలి. దైవ సందేశ ప్రచారం కొరకు మనస్సు లగ్నం కావాలి, జవాబుదారీతనం ఉండాలి. సృష్టిరాశుల పట్ల ప్రేమ, నిడారంబరత, దైవదాస్యభావన, సత్యం, న్యాయం తదితర అంశాలు మనలో ఉండాలి. ఎందుకంటే ఈ విలువలు, లక్షణాలలో మన ఆకాంక్ష నెరవేరే ప్రమాణాలు దాగి ఉన్నాయి. ఒకవేళ ఈ సంక్షిప్త చిరుపుస్తకం నవ యువకుల్లో, మహిళల్లో, పిల్లలలో, వృద్ధులలో ఈ గుణగణాలను పొందే కోరిక, ఆకాంక్ష జనింపజేస్తే, వారి హృదయాలలో ఈ వెలుగును ప్రకాశింపజేస్తే నేను ఎంతో అదృష్టవంతుడినని భావిస్తాను.

4, రమజానుల్ ముబారక్ 1406,
13 మే 1986

ఖుర్రమ్ మురాద్
లీస్టర్ (ఇంగ్లాండ్)

కొన్ని దృశ్యాలు

నా వద్ద ఒక అందమైన ఆల్బమ్ ఉంది!

నా దృష్టి ఏదైనా అందమైన దృశ్యంపై పడినప్పుడు, అది నా వద్ద కలకాలం ఉండిపోవాలని నా మనస్సు కోరుకుంటుంది. దాన్ని నేను నా ఆల్బంలో అంటించేసుకుంటాను. ఇలాంటి అందమైన అనేక దృశ్యాలను నేను చాలా రోజుల నుండి సేకరిస్తున్నాను. ఇప్పటి వరకు నా ఆల్బంలో నాకు ఇష్టమైన, అందమైన, అపురూపమైన లెక్కలేనన్ని దృశ్యాల గ్రంథాలు తయారయ్యాయి. ఈ రోజు దీన్ని తెరిచి, ఇందులోని కొన్ని దృశ్యాలను మీకు చూపించి, మీకు కన్నులపండుగ చేయాలని నా మనస్సు కోరుకుంటుంది. బహుశా ఈ మనోహరమైన చిత్రాలు మీ కళ్లల్లోనే నిలిచిపోయి, మీ హృదయం వాటి సౌందర్యంలో లగ్నమై, మీ దృష్టి వాటి పైనే నిలిచిపోవచ్చు. మీరు వాటిని నా ఆల్బం నుండి పొంది మీ హృదయంలో అలంకరించుకోవచ్చు. ఇవి మీ హృదయాంతరాళాలలో స్థిర నివాసమేర్పరచుకోవచ్చు.

ఈ దృశ్యాలు మీకు నచ్చినట్లైతే వీటిని నిరభ్యంతరంగా మీకు బహుమానంగా ఇచ్చేస్తున్నాను. మీరు వీటిని గుండెలకు హత్తుకుని, మనస్సులో దాచుకుంటూ మీ ఆల్బంలో అలంకరించుకోండి. వీటిని మీకు ఇచ్చేయడం వల్ల నా వద్ద ఉన్న దృశ్యాలలో ఎలాంటి కొరత ఉండదు. నా ఆల్బం ఖాళీగానూ ఉండదు. వీటిని తీసుకోవడానికి కెమేరా, ఫిల్మ్, ప్లేట్ల అవసరమూ లేదు. కేవలం మీ కళ్ల కెమేరా, హృదయపు ఫిల్మ్ ఉంటే చాలు. ఎందుకంటే ఇవి ప్రత్యక్ష దృశ్యాలు.

ప్రతీ వస్తువు ప్రత్యేకమైనది

నా ఆల్బం అరుదైన, ప్రత్యేకమైన, అపూర్వమైన ఆల్బం. సాధారణ ఆల్బంల కంటే పూర్తిగా భిన్నమైనది. ఇందులో దళసరి పేజీలు లేవు. ఇది నిశ్శబ్దమైన లేదా నిర్జీవమైన ఆల్బం ఏమీకాదు. ఇది ఒక ఎడతెగని, ఉత్తేజపరిచే సజీవమైన ఆల్బం. దీనికి చెమ్మకూడా పట్టదు. ఈ దృశ్యాలు గుండె చప్పుళ్ల ఫ్రేమ్‌లో వ్రేలాడుతూ ఉంటాయి. రక్త ప్రసరణతో దీని పేజీలు చకచకా ముందుకు సాగుతాయి.

ఇలాంటి అపూర్వమైన ఆల్బం ఏమిటా? అని ఆలోచిస్తున్నారు కదూ! నా శరీరానికి కేంద్రమైన నా హృదయమే ఆ ఆల్బం!! ప్రేమ అయినా, ద్వేషమైనా, దృఢ సంకల్పమైనా లేదా భయమైనా ప్రతీది రక్త నాళాల్లో, రక్త కేశ నాళికల్లో ఇక్కడి నుండే దృశ్యాలను విరజిమ్ముతూ ఉంటుంది. ఇది అనంత మైన పేజీలు కలిగి, శాశ్వతంగా ఉండే ఆల్బం.

ఇందులో పదిలపరచిన దృశ్యాల అందం, సొగసు చాలా ప్రత్యేకమైనది. ఈ దృశ్యాలు కూడా చాలా ప్రత్యేకమైనవే! అయినా ఈ సృష్టిలో అందానికి, సౌందర్యానికి ఏం తక్కువైందని? సర్వసృష్టికర్త, కరుణామయుడు, కృపాసాగరుడు, సుందరమైన వాడు, సృష్టికి రూపాన్నిచ్చిన అల్లాహ్ సృష్టించిన రంగురంగుల రాళ్ళు, ఎత్తుపల్లాలు కలిగిన పర్వతాలను చూడండి, వికసించి పరిమళాలు వెదజల్లే పుష్పాలు, వసంత కాలంలో లేత చిగురాకులతో విలసిల్లే చెట్లను చూడండి, ఆకాశంలో పొదిగి ఉన్న మెరిసే నక్షత్రాల వైపు దృష్టి సారించండి. భూమిపై సువిశాలమైన నేలపై నడవండి, ఆకాశంలో ఎగురుతున్న పక్షులను, ధరణిపై నడిచే పశువులను చూడండి. ఆయన ప్రతీ చోట అందాన్ని, సౌందర్యాన్ని ఇనుమడింపజేశాడు. ప్రతీ వస్తువును అందమైనదిగాను, ఉదాత్తమైనదిగానూ సృష్టించాడు. అన్నివైపులా సౌందర్యాన్ని వెదజల్లాడు. ఏ వైపు దృష్టి సారించినా అందమే అందం కనబడుతుంది.

నాకు అన్నింటికంటే ఎక్కువ అందంగానూ, మనోహరంగాను ఏ వస్తువు కనిపిస్తుందో మీకు తెలుపనా? నాకు అన్నింటికంటే అందంగా ఒక వ్యక్తి అగుపిస్తాడు. ఆయన మంచితనం, సుగుణాలు, సుస్వభావం, సులక్షణాలు కలిగి ఉండటం వల్ల గొప్ప ఆదర్శమూర్తిగా కనబడతాడు. ఆయన అందాన్ని, మనోహరత్వాన్ని గురించి ఏమని చెప్పమంటారు!

ఆయన కంటే ఉత్తమమైన వ్యక్తిని ఇప్పటివరకు భూమ్యాకాశాలలో చూడలేదు. ఇప్పుడు మీరే చెప్పండి ఆయన కంటే అందంగా ఎవరుంటారు? ఆయన చిత్రం కంటే అందంగా ఎవరి చిత్రం కాగలదు? ఆయన మహోన్నత స్థానానికి చేరుకున్నారు. ఆయన సౌందర్య కాంతిలో చీకట్ల తెరలన్నీ తొలగిపోయాయి. ఆయన ప్రతీ గుణం అందమైన దృశ్యంగా రూపుదాల్చింది. ఆయనపై, ఆయన సంతానంపై దరూద్ పంపించండి.

ఇప్పటివరకు నా హృదయమనే ఆల్బంలో దృశ్యాల అపురూప సౌందర్యాన్నే మీరు చూశారు. ఇప్పుడు కొద్దిగా ఈ దృశ్యాల ప్రత్యేకతను కూడా వీక్షించండి. మీకు నేను చూపించబోతున్న దృశ్యాలు కెమేరాలు లేని కాలానికి చెందినవి. ఆ కాలంలో కాగితాలపై, రాళ్లపై చేతితో చెక్కిన చిత్రాలు ఉండేవి. ఇప్పుడైతే కెమేరాలు, వీడియో కెమేరాలు కూడా వచ్చేశాయి. ఆ కాలంలో ఇలాంటి పరికరాలు ఉన్నా వాటితో తీసిన దృశ్యాల సౌందర్యం నా మనస్సు లోను, నా కళ్లల్లోనూ అంతగా నాటుకునేది కాదు. కెమేరాలతో తీసిన నిశబ్దమైన, నిర్జీవమైన చిత్రాలలో నేను నా మనస్సును ఎలా లగ్నం చేయ గలను? మూవీ కెమెరాతో తీసిన చిత్రాలు కదలికలతో నడుస్తూ, మాట్లాడుతూ కన్పిస్తాయి. కాని అవి తోలు బొమ్మల వలె కదులుతుంటాయి. ఈ కదలికలు మనస్సును ఉత్సాహ పరిచేవి కావు.

నా మనస్సు ఆల్బంలో అతికించి ఉన్న దృశ్యాలు పదాలతో రాయబడిన దృశ్యాలు. నేను ఏ దృశ్యాలనైతే నా ఆల్బంలో అతికించుకున్నానో అవి నా

చూపుల ఛాయా పటాలలో అలంకరించబడి ఉన్నాయి. ఏ చిత్రాలనైతే నేను మీకు చూపించాలనుకుంటున్నానో వాటిని అత్యంత సౌందర్యం కలిగిన దైవప్రవక్త (స) వారి సహచరులు తమ సజీవమైన, అందమైన, అపురూపమైన పదాలతో తీశారు. పదాలతో తీసిన దృశ్యాల మాటే వేరు. ఇవి కన్నుల ఎదుట ప్రత్యక్షమవుతాయి. మనస్సులలోనూ దిగబడిపోతాయి. ఉత్సాహాన్ని ఉప్పొంగేలా చేస్తాయి. వీటి వల్ల గుండె చప్పుడు వేగవంతమవుతుంది. ఇవి రక్తంలో వేడిమి, హృదయంలో ప్రశాంతతను జనింపజేస్తాయి. అలాంటప్పుడు ఈ దృశ్యాల కంటే ఎక్కువ మనోహరమైన, ఆకర్షణీయమైన, సంపూర్ణమైన దృశ్యం మరేది కాగలదు!

ప్రేమామృతం కురపించడంలో ఆయనకు ఆయనే సాటి

ఈ దృశ్యాలు నాకు చాలా ఇష్టమైనవి. వీటిని నేను అధికంగా ప్రేమిస్తాను. మీరు కూడా నాలాగే వీటిని తప్పక ప్రేమిస్తారని, ఇంకా నా కంటే అధికంగా, శాశ్వతంగా ప్రేమించాలని నా కోరిక, నా అభిలాష. ప్రేమామృత మూర్తి, విశ్వకారుణ్యమూర్తికి చెందిన కొన్ని దృశ్యాలను అంటే ఆయన తన మాటల్లో చిత్రీకరించిన వ్యక్తులను ఈ రోజు నేను మీకు చూపించాలను కుంటున్నాను.

ఆయన (స) సహచరుడు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజి) ఇలా తెలిపారు : ఒక వ్యక్తి దైవ ప్రవక్త (స) వద్దకు వచ్చాడు. అతని మనస్సులో ఒక సందేహం ఉంది. ఈ సందేహం మనందరి మనస్సుల్లోనూ ఉన్నదే. ఆ వ్యక్తి మనందరి తరపు నుండి ఆ సందేహాన్ని అడిగేశాడు.

ఓ దైవ ప్రవక్తా (స)! ఒక వ్యక్తి కొందరిని ప్రేమించాడు కాని వారిని చేరలేకపోయాడు.

ఆ వ్యక్తికి తాను ప్రేమించిన వారి సహచర్యం లభించలేదు. కలవనూ

లేదు. కాలం, ప్రదేశం, విద్యాజ్ఞానాల అంతరమూ ఉంది. తమరు ఆ వ్యక్తిని గురించి ఏమంటారు?

ఆయన (స) ఇలా సెలవిచ్చారు,

మనిషి తాను ఎవరినైతే ప్రేమిస్తాడో, అతనితోనే ఉంటాడు. (బుఖారి, ముస్లిం)

మీకు అనుమానముంటే ప్రేమించి చూడండి. కాలం, దూరాల అంతరం ఎలా మాయమై పోతుందో మీరే తెలుసుకుంటారు. అలాగే శాశ్వతంగా ఉండబోయే పరలోకం విషయంలో కూడా ఇదే శుభవార్త ఉంది.

దైవప్రవక్త (స) గారి మరొక సహచరుడు హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలిపారు; ఒక వ్యక్తి ప్రవక్త (స)తో ఇలా అడిగాడు,

ప్రళయం ఎప్పుడు సంభవిస్తుంది?

ఆయన (స) ఇలా సెలవిచ్చారు,

అడుగుతున్నావు గాని దీని కొరకు సన్నాహాలు పూర్తి చేసుకున్నావా?

అతను ఇలా అన్నాడు.

సన్నాహాలు ఏమీ చెయ్యలేదు, కాని కేవలం అల్లాహ్‌ను, ప్రవక్త (స) లను ప్రేమిస్తున్నాను.

దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు.

అయితే నీవు ఎవరిని ప్రేమించావో వారితోనే ఉంటావు.

దీనికంటే అధికంగా సంతోషం కలిగించే మాట మరేమి కాగలదో చెప్పండి! ఆ కాలంలో దైవ ప్రవక్త (స) ప్రత్యక్షంగా వారి మధ్యనే ఉన్నారు. ప్రజలు ఈ శుభవార్తను విని ఎంతగా ఆనందభరితులయ్యారంటే, ఇస్లాం స్వీకరించిన తర్వాత దాని కంటే ఎక్కువగా మరే ఇతర మాటా వారిని సంతోషభరితుల్ని చెయ్యలేదు. ఇక మన విషయానికొస్తే, పరలోక సన్నాహాల్లో

పూర్తిగా వెనుకబడి ఉన్నాము, పరలోక సన్నాహాల విషయంలో మనలాంటి చేతకాని వారికి, బలహీనతలతో బ్రతుకుతున్న మనలాంటి వారికి ఈ మాట కంటే అధికంగా సంతోషాన్ని, హాయిని, ఆనందాన్ని కలుగజేసే మరే మాట ఉంటుంది? అల్లాహ్‌ను, ప్రవక్త (స) ను ప్రేమిస్తే అల్లాహ్‌ను, ఆయన ప్రియప్రవక్త (స)ను, వీరిద్దరినీ ప్రేమించే వారందరి తోడు లభిస్తుంది.

దైవప్రవక్త (స) ఇప్పుడు మన మధ్యలేరు. కాని ఆయన గారి వ్యక్తిత్వం, ఉన్నత ఆచరణలను మన కళ్లముందు ఆవిష్కరించే వివరణల సాహితీ దృశ్యాలు మన దగ్గర ఉన్నాయి. అవి మన సంపూర్ణ జీవితానికి సంబంధించిన దృశ్యాలు. ఉత్తమ జీవన విధానాన్ని చూపించే ఈ నమూనాలను అనుసరించి, ఒక్కొక్క గుణాన్ని ప్రేమించడం ప్రారంభిస్తే, వాటిపైన మన దృష్టిసారించినట్లైతే, వాటిని హృదయంలో ప్రతిష్ఠించుకుంటే, ఆ విధంగా రూపొందే ప్రయత్నాలలో నిమగ్నమైపోతే, నిస్సందేహంగా మనం కూడా ఈ శుభవార్తకు హక్కుదారులం కాగలుగుతాము! మనం ఈ రోజు ఆయన (స) పాదాల చెంత కూర్చోలేము. కాని, వారి ప్రతీ పాదముద్రను గురించి విని దానిపై నడుచుకుంటే ప్రళయ దినాన తప్పకుండా వారిని కళ్లతో చూడగల్గుతాము. ఆయన (స) సాన్నిహిత్యమనే సౌభాగ్యం ఇన్షా అల్లాహ్ కల్గవచ్చు.

ఇక్కడ తప్పకుండా చెప్పాల్సిన మాట ఒకటుంది. ఏ దృశ్యాలనైతే నేను మీకు చూపించడానికి బయలుదేరానో ఆ దృశ్యాలతో కేవలం అభిరుచికి సంబంధించినవి మాత్రమే కాదు, హృదయాన్ని కదిలించే శోక కెరటాల చిత్రీకరణలుకూడా ఉన్నాయి. ఆ విషాదాలను మీరు కూడా అనుభూతి పొందుతారు. ఈ నొప్పి, బాధ ఎందుకు? దీనికి కారణం, నేను ఒకవైపు ఈ దృశ్యాలను చూస్తూ, మరోవైపు నా జీవితాన్ని చూసుకున్నప్పుడు ఈ రెండింటిలో ఎంత అంతరం, కనబడుతుందో చూసుకుని అనుకోకుండానే నా మనస్సు ప్రవక్త (స) పట్ల దుఃఖానికి, విచారానికీ గురవుతుంది. నా మనస్సు 'ప్రేమ' లేకుండా ఖాళీగా లేదుకదా? ఈ ఉత్తమ జీవన దృశ్యాల సౌందర్యం

నుండి దృష్టి మరల్చి గుర్తు తెలియని ఏ మార్గాల వైపు ప్రయాణిస్తున్నాను?? నేను ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ఆ వ్యక్తి (స), సామీప్యతకు నోచుకో లేనేమో!? ఎవరితో ప్రేమ కలిగి ఉన్నానని ప్రమాణం చేశానో, ఎవరి వెనుక నడిచే కోరిక నా మనస్సులో కలిగి ఉన్నానో ఆయన(స) కు దూరంగా ఉంటే??? అని ఆలోచించుకుని నాకు దుఃఖం, విచారాలు కలుగుతాయి.

ప్రవక్త (స) ఆదర్శ జీవన దృశాలతో పాటు మన జీవితాలకు ఆ ఉత్తమ నమూనాకు మధ్య ఉన్న తేడా తెలుసుకుని విచారించే దుఃఖాన్ని కూడా నేను మీకు ఇవ్వాలనుకుంటున్నాను. మీరు ఈ దృశ్యాలను తీసుకువెళ్తూ, వాటితో పాటు ఈ దు:ఖం, విచారాన్ని కూడా మీతో పాటు తీసుకుని వెళ్లండి. దుఃఖం, విచారాలు బహుమానాలు కావు. బహుమానమంటే సంతోషాన్ని, ఆనందాన్ని ఇచ్చేది. కానీ మీకు ఈ దుఃఖం కలిగినట్లైతే భవిష్యత్తులో భయ పశ్చాత్తాపాల నుంచి విముక్తి పొందే ఆచరణలకు పూనుకొంటారు. "లా ఖౌఫున్ అలైహిమ్ వలా హుమ్ బజజ్నూన్" అంటే వారికి భయమూ ఉండదు, వారు బాధకు లోను కారు అనే శుభవార్తకు హక్కుదారులయ్యే సౌభాగ్యం పొందుతారు. మన ప్రియ ప్రవక్త (స) వారి సాహచర్య సౌభాగ్యం పొందగలరు.

మీరు ఈ ఉత్తమ దృశ్యాల జీవన సౌందర్యం చూసి ఆనందం పొందుతూ, ఆ విధంగా మీ హృదయంలో ప్రవక్త (స) పట్ల ప్రేమ జనించి, మీ జీవితాన్ని పోల్చి చూసుకునే ఒక అద్దంలో మీరు చూసుకున్నప్పుడు మీ రూపం, మీ జీవితం, మీ సమయం, మీ రేయింబవళ్లు, మీ ప్రతిబింబం ప్రవక్త (స) గారి నమూనాకు ఎంతవరకూ పోలి ఉన్నాయో చూసుకోవాలి.

సందేశాత్మక దృశ్యం

ఈ దృశ్యాలు ఎలా ఏర్పడ్డాయంటే లెక్కలేనన్ని చిన్న చిన్న పదాలను ఒక ప్రత్యేక క్రమంలో ఒక చోట చేర్చినట్లైతే ఒక స్పష్టమైన రూపం వస్తుంది. అనేక రూపాలను ఒక దానితో ఒకటి కూర్చినట్లయితే అవన్నీ కలిసి ఒక

దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి. దైవప్రవక్త (స) వారి జీవన దృశ్యాలన్నింటిని నేను ఒకచోట పేర్చాను. ఆయన (స) సహచరులు పేర్చిన క్రమంలోనే నేను కూడా పేర్చాను. వాటిని ఆద్యంతం పరిశీలిస్తూ పోతుంటే అన్నింటి కంటే స్పష్టమైన, చలింపజేసే దృశ్యం ఒకటి కానవచ్చింది. ఆయన (స) అల్లాహ్ పంపిన దైవ సందేశహరులు. ఆయన (స) వద్ద ఒక సత్య సందేశం ఉంది. ఈ సందేశాన్ని అందజేయడమే ఆయన (స) జీవితాశయం. నేను గ్రహించింది ఏమంటే ఏ క్షణంలోనయితే హిరా గుహలో దైవవాణి, మార్గదర్శకత్వపు మొదటి కాంతి పుంజం ఆయన (స) పవిత్ర హృదయాన్ని తాకినప్పటి నుండి తన జీవిత అంతిమ ఘడియ వరకూ సమస్తాన్ని దైవానికి అప్పగించి అల్లాహ్‌కు చేరువై పోయారు. ఆయన (స) జీవితం దైవదౌత్యం, సందేశ ప్రచారాల దృశ్యమాలిక. ఆయన (స)కు ప్రతీ నిమిషం సందేశ ప్రచారమే ధ్యాస; దీని గురించే ఆలోచన, బెంగ; దీని కొరకే రేయింబవళ్లు అంకితం చేశారు. దీని కొరకే అన్వేషణ, ఉరుకులు పరుగులు; ప్రజలతో పరిచయాలు, సహవాసాలు, పరిశ్రమ, ప్రయత్నాలన్నీ దీనికొరకే.

ఉస్వయే హసన (ఆదర్శ నమూనా) అన్నమాట విన్నప్పుడు మన మెదడులో ఆయన (స) ఎలాంటి దుస్తులు ధరించేవారు? ఆయన (స) ఎలాంటి అన్నపానీయాలు సేవించేవారు? ఆయన (స) కదలికలు ఎలా ఉండేవి? ఆయన (స) గుణగణాలు ఎలాంటివి అని మాత్రమే ఆలోచిస్తాము. ఉస్వయే హసన (ఆదర్శ నమూనా) పేరు వినగానే మన మనస్సులో పైన చెప్పిన దృశ్యాలు కదలాడవు. కనీసం వాటి వలె మన జీవితాలు కూడా మారాలన్న ఆలోచన కూడా కలుగదు. ఆయన (స) మక్కా వీధులలో తిరిగిన దృశ్యం; సఫా కొండపై నిల్చుని వారు ఇచ్చిన పిలుపు, తాయిఫ్ లోయలో వారి కాళ్లకు అయిన గాయాలు, బదర్, ఉహద్, హునైన్, హుదైబియా యుద్ధాల దృశ్యాలు కనీసం మన మనస్సులలో కదలాడవు.

అన్నపానీయాలను గ్రహించే, నిద్రించే, మేల్కొనే, నడిచే దృశ్యాలు ఇవన్నీ నిస్సందేహంగా ఆయన (స) జీవితంలోని ఆదర్శ నమూనాలో ఒక భాగమే. ఇందులోని ప్రతీ దృశ్యం అందమైనది. మనకు ముఖ్యమైనది. అందుకే ఈ దైవ వాక్యం వవెలువడింది :

'వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉండింది"

(అల్ అహజాబ్ 33:21)

దైవప్రవక్త (స) వారి మాటలను పరిశీలిస్తే విషయమంతా మీకు అర్థమైపోతుంది. తర్వాత మీకు వారి ప్రతీ నమూనా దృశ్యమూ ముఖ్యమైనదిగా కనబడుతుంది. కాని జీవన దృశ్యాలన్నింటిలో ఒక దృశ్యం ప్రత్యేకంగా ప్రసిద్ధమైనదిగా నిలుస్తుంది. సందేశ ప్రచారం కొనసాగించిన దృశ్యమది. ఖుర్ఆన్ వాక్యాల్లో పారాయణం చేసిన దృశ్యమది, ఆయన (స) జీవితంలోని ప్రతి దృశ్యం ఒక ఆదర్శం. నిశ్చయంగా ఆయన (స) తెల్పిన విధానంలోనే వస్త్రధారణ ఉండాలి; మనం తినే, తాగే, నిదురపోయే, మేల్కొనే, నడిచే పద్ధతులన్నీ కూడా ఆయన (స) జీవన సరళిని అనుసరించే ఉండాలి. మన గుణగణాలు కూడా ఆయన (స) గుణగణాల రంగులో మిళితమైపోవాలి. ఒకవేళ మన జీవనశైలి ఆయన (స) జీవన సరళివలే రూపొందకపోతే వాస్తవానికి మన హృదయంలో ఆయన (స) పట్ల ప్రేమలేనట్లే లెక్క.

నేను ఈ దృశ్యాలను ఎందుకు ఎన్నుకున్నానో ఇప్పుడు మీకు అర్థమయ్యే ఉంటుందనుకొంటున్నాను.

ఇక రండి! ఇప్పుడు నేను నా ఆల్బంను తెరిచి ముందుంచుతాను.

మొదటి దృశ్యం

అశ్రు నయనాలు

ఈ మొదటి దృశ్యాన్ని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్ (రజి) మనకోసం జాగ్రత్త పరచి ఉంచారు.

ఆయన ఇలా అన్నారు : ఒక రోజు నేను దైవప్రవక్త (స) గారి సేవలో హాజరయ్యాను, ఆయన (స) మెంబరుపై ఆశీనులై ఉన్నారు. నన్ను ఉద్దేశిస్తూ ఇలా అన్నారు,

"అబ్దుల్లాహ్! నాకు ఖుర్‌ఆన్ పఠించి వినిపించు".

నేను ఆశ్చర్యం, అణుకువలతో ఇలా అడిగాను :

"నేను మీకు చదివి విన్పించాలా! మీ పైనే కదా ఖుర్‌ఆన్ అవతరించింది?"

ఆయన (స), "అవును, ఇతరుల నుండి వినాలని కోరుకుంటున్నాను".

అబ్దుల్లాహ్ ఇలా తెలియపర్చారు :

"నేను అన్‌నిసా సూరా పఠించడం ప్రారంభించి ఈ ఆయత్ వరకూ చేరుకున్నాను,

"మేము ప్రతీ సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి నిన్ను వారికి సాక్షిగా నిలబెట్టినప్పుడు వారు ఏం చేస్తారో ఆలోచించు." *(అన్‌నిసా 4:40)*

అబ్దుల్లాహ్ ఇక చాలించు అనే శబ్దం వినబడింది. నేను తలపైకెత్తి చూడగా ఆయన (స) కళ్ల నుండి అశ్రువులు ధారాళంగా ప్రవహిస్తున్నాయి.

(బుఖారి, ముస్లిం)

ఈ దృశ్యాలు చూడండి. బాగా పరిశీలించి చూడండి! ప్రవక్త (స) నయనాలను అశ్రుపూరితం చేసిన విషయం ఏది? అని ఆలోచించండి. అది ఒక బాధ్యతతో కూడిన ఆలోచన. అల్లాహ్ దాసుల ఎదుట సత్యాన్ని, వాస్తవాన్ని గురించి సాక్ష్యమిచ్చే బాధ్యత అది. ఇది సందేశ ప్రచార బాధ్యత. ఏదో ఒక రోజు అల్లాహ్ ముందు నిలబడాల్సి ఉందన్న స్పృహతో కూడిన చింతన. నీవు సాక్ష్యమిచ్చే బాధ్యతను ఎంతవరకు నిర్వర్తించావు? అని అల్లాహ్ అడిగినప్పుడు నేనేం జవాబివ్వను అనే భయంతో కలిగిన చింతన అది, ఆయనకు విశ్వ ప్రభువు పట్ల ఉన్న ప్రేమను చూడండి, దైవం ముందు నిలబడాలనే భయాన్ని ఎంతగా కలిగి ఉన్నారో చూడండి. ఇది దైవం పట్ల ప్రేమ దైవభీతి కలగలిసిన చింతన. సృష్టిరాశుల పట్ల ఆయన హృదయంలో ఉప్పొంగుతున్న కరుణా కటాక్షాలకు ఈ దృశ్యాలు అద్దం పడుతున్నాయి. దైవ వాక్యాలపై విశ్వాసం ఆయన (స) మనసులో కుంభవృష్టిగా కురిసింది. ఆ వర్షపు చినుకులు కొన్ని ఆయన (స) కళ్లల్లో ప్రత్యక్షమై అశ్రువుల రూపంలో ప్రవహించసాగాయి. అలాంటప్పుడు ఈ దృశ్యంపై మనకు ప్రేమ జనించడం సహజమే కదా!

ఇప్పుడు ఈ దృశ్యాన్ని మన జీవితంతో పోల్చి చూసుకోండి. ముస్లిములుగా మనం ప్రజలకు సత్యసందేశం అందించే బాధ్యత కలిగి ఉన్నాం. మన జీవిత లక్ష్యం కూడా ఇదే. రేయింబవళ్లు మన నాలుకలపై షరీఅత్, ఇస్లామీయ జీవన సరళి, ధర్మసంస్థాపన, దైవ శాసనం, సత్యం, సాక్ష్యం అన్న పదాలే ఉండాలి. నిజం చెప్పండి, రాత్రి చీకటిలో ఒంటరిగా ఉన్నా లేదా పగటి వెలుతురులో ఉన్నా ఈ బాధ్యత గురించి ఆలోచించి ఇప్పటి వరకూ ఎన్నిసార్లు మన కళ్లలో నీళ్లు తిరిగాయి? మన చుట్టూ నివసించే ప్రజల విషయంలో అల్లాహ్ ముందు నిలబడి ఏమని జవాబు చెప్పగలం?

ఏ విధంగానైతే దైవప్రవక్త (స) మన ముందు సత్యానికి సాక్ష్యమిచ్చారో అదేవిధంగా మనం కూడా సర్వ మానవాళి ముందు సాక్షమిచ్చే బాధ్యత కలిగి

ఉన్నామన్నది మనందరికి తెలిసినదే! వారు ఏ విధంగానయితే అల్లాహ్ ముందు నిలబడి ఉంటారో, అదే విధంగా మనం కూడా నిలబడి ఉంటాము. స్కూల్, కాలేజ్, వీధి, ఆఫీస్, నగరం, దేశంలో నివసిస్తున్న మార్గరాహిత్యంలో కొట్టుమిట్టాడుతున్న ఇతర కుటుంబ సభ్యులు మానవుల ముందు సత్యానికి సాక్ష్యమిస్తున్నామా? లేదా? మనం సాక్ష్యమిచ్చే బాధ్యతలో చురుకుగా ఉన్నామా? లేదా నిర్లక్ష్యంతో జీవనం కొనసాగిస్తున్నామా? మానవులందరి గురించిన చింతన మనలో ఉందా? లేక కేవలం ఐహిక చింతన మాత్రమే ఉందా? లేక మీ మోక్ష చింతన ఉందా? అనేది ఆలోచించాలి.

వీటన్నింటిని గురించి ఆలోచిస్తే మీ కంటనీరు ప్రవహించటం లేదా? ఒకవేళ మీ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటే దైవప్రవక్త (స) వారి ఈ దృశ్యం మీ హృదయాలలో దిగలేదని అర్థం. అల్లాహ్ పట్ల, ఆయన సృష్టిరాశుల పట్ల మీ మనస్సులో ప్రేమ జనించలేదని అర్థం. ఎన్ని ప్రసంగాలు చేసినా, ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని నినాదాలు లేవనెత్తినా, ఎన్ని సభలు నిర్వహించినా ఈ ప్రేమ మీ హృదయంలో కలగనంత వరకూ ఏమీ సాధించలేరు.

ప్రవక్త (స) జీవితంలోని దృశ్యం చూసిన తర్వాత దైవభీతితో వణికి పోయి రోదించాలి. తన ప్రభువు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, ఆయన ఇష్టాయిష్టాల ధ్యాసే లేకుండా, తన ప్రభువు మార్గంపై నడవకుండా, తన ప్రభువును ఆరాధించకుండా జీవితం గడిపిన వ్యక్తి గురించి మిమ్మల్ని విశ్వ ప్రభువు అడుగుతాడు. మీరు అతని మార్గభ్రష్టత గురించి జవాబు ఇవ్వవలసి ఉంటుంది. అతను తన ప్రభువు నుండి దూరంగా ఉండటానికి మీరూ బాధ్యులు కాగలరనే విషయం గురించి ఆలోచించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఇప్పుడు రెండవ దృశ్యం చూడండి. ఈ దృశ్యం ఏ మానవ మాత్రుడు చిత్రీకరించినది కాదు. దీనిని 'అల్ ముసవ్విర్' (సృష్టికి రూపాన్నిచ్చేవాడు) స్వయంగా చిత్రీకరించాడు. ఆయన అద్భుత చిత్రీకరణపై సమస్త సృష్టిరాశి సాక్షిగా ఉన్నది.

రెండవ దృశ్యం

ప్రాణాంతక దు:ఖం

"ప్రవక్తా! వారు విశ్వసించరు అని దు:ఖపడుతూ, బహుశా నీవు నీ ప్రాణాలను కోల్పోతావేమో" (అష్షుఅరా 26:3)

ఈ పదాలు చాలా సంక్షిప్తమైనవి, కాని ఈ దృశ్యం సంపూర్ణమైనది. కొన్ని పదాలలోనే అనేక రంగులు మిళితమై ఉన్నాయి. హృదయాన్ని కలతకు గురిచేసే దృశ్యాలు అనేకం ఇందులో ఇమిడి ఉన్నాయి.

దీనిలోని ఒక దృశ్యం చూడండి! పగలు సూర్యుడు ఉదయించడం ఎంత నమ్మశక్యమైనదో అంతే భరోసా ప్రవక్త (స) సత్యసంధత, నిజాయితీ పైనా ఉంది. మనకు కనపడని అగోచరాలు దైవప్రవక్త (స)కు కనబడ్డాయి. కాని, ఆయన మాటలను, బోధనలను నిరాకరించడమంటే అర్థం ఏమిటి? ఒక వ్యక్తి పగటి సమయంలో ప్రజలతో "ప్రజలారా! ఇది పగలు" అని అంటే ప్రజలు దాన్ని నమ్మకుండా నిరాకరించడం వంటిది. పగలును పగలు అనడం అబద్ధమని వాదించడం ఎలా ఉంటుందో ఊహించండి. నిజానికిది పిడివాదం. తలబిరుసుతనం. ఈ తలబిరుసుతనం పట్ల ప్రవక్త (స) మనస్సు ఎంతగా తల్లడిల్లిందో! ప్రజలు తనపట్ల శత్రుత్వం, నిరాకరణ తర్వాత కూడా ప్రజలు తమ తలబిరుసు వైఖరి అవలంబించినా ప్రవక్త (స) మనస్సులో కోపం, ద్వేషం కలిగి, వారు వినాశనం చెందాలనే ప్రతీకార వాంఛ ఏ కోశానా కలుగలేదు. పైగా వారిపట్ల శ్రేయోభిలాష, అపారప్రేమ తన హృదయంలో నిండి ఉంది. కేవలం ఒకే ధ్యాస, ఒకే అభిలాష, ఒకే చింతన, ఒకే బాధ – ఎలాగైననూ ఈ ప్రజలు విశ్వాస మార్గంపై వచ్చి, అల్లాహ్ ఆగ్రహం, నరకాగ్నితో రక్షించబడి

ఇహపరలోకాలలో అనేక వరాలతో సత్కరించబడి, స్వర్గంలో ప్రవేశించబడా లనేది ఆయన (స) లక్ష్యం.

ప్రవక్త (స) జీవితంలోని అద్భుత దృశ్యం ఇది. దీని నుండే 'లఅల్లక బాఖివున్ నఫ్సక' అనే దృశ్యం కనబడుతుంది. ఈ చింతనలోనే ఆయన (స) ఉఛ్వాస నిశ్వాసాలు కొనసాగబడ్డాయి.

తన మాట వినడం లేదన్న బాధ కాదు. సత్యవచనాలను తిరస్కరిస్తున్నా రన్నదీ కాదు.. ఏదో ఒక విధంగా ప్రజలు తన మాటలను విశ్వసించాలనే ఉద్దేశమూ లేదు. ఈ బాధ, దు:ఖం ఎందుకంటే ప్రజలు భగభగ మండే అగ్ని వైపు వేగంగా పరుగులు తీస్తున్నారు. అందులో పడిపోతున్నారన్నది ఆయన దుఃఖం. ఈ వాస్తవాన్ని ప్రజలు గుర్తించడం లేదన్నది ఆయన (స) విచారం.

"ఎంత ధైర్యం వీరికి, నరక శిక్షను సైతం భరించటానికి సిద్ధంగా ఉన్నారు!" (అల్ బఖర 2:175)

ఒకవైపు అల్లాహ్ పట్ల, ఆయన సృష్టిరాశుల పట్ల ప్రేమ, కారుణ్యం ఎందుకంటే స్వయంగా ఆయన విశ్వ కారుణ్యమూర్తి గనుక. మరోవైపు ఎవరి పట్లనయితే ప్రేమ కలిగి ఉన్నారో వారు నిజ ప్రభువు నుండి దూరంగా పరుగెత్తి వినాశనం పాలవుతూ పోతున్నారు. ఇలాంటి పరిస్థితిలో మనస్సు ఎలాంటి దుఃఖానికి గురవుతుందో కొద్దిగా ఆలోచించండి. దైవప్రవక్త (స) స్వయంగా దీని గురించి ఇలా సెలవిచ్చారు.

"నా ఉదాహరణ ఎలాంటిదంటే, ఒక వ్యక్తి అగ్ని రాజేశాడు. దీనితో చుట్టుపక్కలంతా వెలుతురు అయ్యింది. అప్పుడు రెక్కల పురుగులు, మిడతలు వచ్చి ఆ అగ్నిలో పడసాగాయి. ఇప్పుడు ఆ వ్యక్తి వాటిని ఆపుతున్నాడు. కాని మిడతలు అతని ప్రయత్నాలను లెక్కచేయక అగ్నిలో పడసాగాయి. అదే విధంగా నేను కూడా మిమ్మల్ని నడుము పట్టుకుని అగ్నినుండి ఆపుతున్నాను. కాని మీరు అగ్నిలోకే వెళ్లి పడుతున్నారు. (బుఖారి, ముస్లిం)

ఇప్పుడు మన జీవితాలను పోల్చి చూసుకుందాం! మీ మాటలను ప్రజలు తిరస్కరించినప్పుడు ఇంతగా మనం బాధపడతామా? మన హృదయంలో నిరాశ, పగ, కోపం ఉక్రోషాలకు బదులుగా కేవలం వారిని సత్యమార్గం వైపునకు తీసుకురావాలనే ఆలోచన, కోరికలు మాత్రమే ఉంటాయా? అల్లాహ్ దాసుల పట్ల ప్రగాఢమైన ప్రేమ మీ హృదయంలో ఉందా? ప్రజలను అపమార్గంలో చూసి మీ ప్రియమిత్రులెవరైనా అగ్నిలోపడి కాలిపోతుంటే చూసి కలిగే బాధ మీ మనస్సుకు కలుగుతుందా? వారిలో మీ తల్లిదండ్రులు, తోబుట్టువులు, భార్యాపిల్లలు, బంధువులు, స్నేహితులు, సహ విద్యార్థులు, సహోద్యోగులు ఎందరో ఉన్నారు. మనం ఎవరి పట్లనయితే అపారమైన ప్రేమ కలిగి ఉంటామో వారి ఇహలోక కష్టాలకడగండ్లు మనల్ని కలతకు గురిచేసి మరణానికి చేరువ చేస్తాయి. దీని ప్రభావం ఎంతగా ఉంటుందో మనందరికీ అనుభవమే! సందేశ ప్రచారం, అల్లాహ్ సందేశాన్ని అల్లాహ్ దాసుల వరకూ చేర్చాలనే ధ్యాస, అపమార్గంపై ఉన్న మానవులను అగ్నిగుండం నుండి కాపాడి, ఋజుమార్గంపై నడిపించి, స్వర్గానికి చేర్చాలనే తపన మీ హృదయాన్ని కలచివేస్తున్నాయా? ప్రజలు అల్లాహ్‌కు అవిధేయత చూపి వారు అగ్నికి ఆహుతి అవుతన్నారనే భావన మీకు కలుగుతుందా? మార్గభ్రష్టత్వం నుండి, భయంకర పరిణామం నుండి నడుము పట్టుకుని వారిని కాపాడాలనే కృతనిశ్చయంతో ఉన్నారా? ఆలోచించండి.

దైవప్రవక్త (స) జీవితంలోని ఈ దృశ్యం ఏదో ఒక మోతాదులో మన జీవితంలో కానరానంత వరకూ ఆయన పట్ల ప్రేమ కలిగి ఉన్నామని చెప్పుకునే అర్హత మనకు ఉండదు.

ఇప్పుడు ఈ మూడవ దృశ్యాన్ని చూడండి. మొదటి రెండు దృశ్యాలు పరంపరలోనిదే ఈ అందమైన, మైమరిపించే మూడవ దృశ్యం. మొదటి రెండు దృశ్యాలు లేకపోయివుంటే ఈ మూడవ దృశ్యం రూపుదాల్చి ఉండేది కాదు.

మూడవ దృశ్యం

దైవదౌత్యపు విధి నిర్వర్తించిన వేళ

సువిశాలమైన అరఫాత్ మైదానంలో ఒకటిన్నర లక్షల మంది ప్రజలు ఒక చోట గుమిగూడి ఉన్నారు. వారిలో పురుషులు, స్త్రీలు, పిల్లలూ ఉన్నారు. వీరిలో అరబ్బుకు చెందిన ప్రతీ మూల ప్రదేశం నుండి వచ్చినవారూ ఉన్నారు. హ|జ్రత్ ఇబ్రాహీం (అ) ఇచ్చిన ఆ పిలుపునకు సమాధానంగా వచ్చారు. ఆ పిలుపు పరంపరకు చెందిన చిట్టచివరి ప్రవక్త నాయకులు హ|జ్రత్ ముహమ్మద్ (స) దీని ఔన్నత్యాన్ని ఇంకా అధికం చేసి, దాన్ని అరబ్బులోని ప్రతి మూల ప్రదేశం వరకూ చేర్చారు. దాదాపుగా పూర్తి ప్రపంచానికి విన్పించారు. ప్రపంచం ఉండేంత వరకూ అంటే ప్రళయ కాలం సంభవించే వరకూ ప్రభవించే ప్రతీ మానవుడి వరకూ దీన్ని చేర్చే ఏర్పాటు చేసి వెళ్లారు.

ఈ దృశ్యంలో దైవప్రవక్త (స) ఒక ఒంటెపై ఆసీనులై అనుచర సమాజానికి చివరి హితబోధనలు గరపుతున్నారు. ప్రసంగం అంతానికి చేరినప్పుడు ప్రజలను ఉద్దేశిస్తూ ఇలా అడుగుతున్నారు :

రేపు అల్లాహ్ సన్నిధిలో మిమ్మల్ని నా గురించి ప్రశ్నిస్తారు. ప్రజలరా! ఆ సమయంలో మీరేమి సమాధానమిస్తారో కొద్దిగా నాకు తెలపండి.

జనసమూహమంతా కలిసి ముక్త కంఠంతో ఇలా అన్నారు :

"మీరు (స) దైవదౌత్యపు విధిని పూర్తిగా నిర్వర్తించారని, మీరు మాకు పూర్తిగా హితబోధ గరిపారని, మీరు అల్లాహ్ అప్పగింతను నిజాయితీగా మా వరకూ చేర్చారని మేము సాక్ష్యమిస్తున్నాము."

దైవ ప్రవక్త (స) తమ చూపుడు వేలును ఆకాశం వైపు పైకెత్తుతూ, జన సమూహాన్ని చూపిస్తూ ఇలా అన్నారు :

అల్లాహుమ్మ అష్‌హద్ (ఓ అల్లాహ్ నీవే సాక్షి!)

అల్లాహుమ్మ అష్‌హద్ (ఓ అల్లాహ్ నీవే సాక్షి!)

అల్లాహుమ్మ అష్‌హద్ (ఓ అల్లాహ్ నీవే సాక్షి!)

(అబూదావూద్, ముస్లిం)

ఇంత ధైర్యంగా మానవులను, అల్లాహ్‌ను తన విధి నిర్వర్తించడంపై సాక్షిగా ఎవరు నిలబెట్టగలరు? ఆ దృశ్యం ఏమిటనేది మనం ఆలోచించాలి.

సందేశ ప్రచారాన్ని జీవిత లక్ష్యంగా మల్చుకొని రేయింబవళ్లు కృషిచేస్తున్నప్పటికీ ఇన్ని సంవత్సరాలు గడిచిపోయినా ప్రజలు మన మాటను వినడంలేదు అనే ఫిర్యాదు మనస్సులో ఉంటుంది. ఈ సందర్భంలో నేను మీకు ఒక మాట చెప్పాలనుకుంటున్నాను. మానవులందరినీ కాకుండా, మీ దేశ మంతటినీ కాకుండా, మీ నగరమంతటినీ కాకుండా, కేవలం మీ వీధి లేదా మీ కుంటుంబంలోని వ్యక్తులను సమావేశపరచి వారితో నేను మీ వరకూ అల్లాహ్ సందేశాన్ని అందజేశానా? హితబోధ గరిపే విధిని నిర్వర్తించానా? అని అడిగి, వారు అల్లాహ్ సన్నిధిలో 'అవును నువ్వు సందేశాన్ని చేర్చి వేశావు' అని అనడానికి సిద్ధంగా ఉన్నారేమో సాక్ష్యం తీసుకోండి.

సందేశాన్ని అందజేసే పవిత్ర బాధ్యత, సాక్ష్యమిచ్చే బాధ్యత మనపై ఉంది. మన ఇంటి వారు, వీధి, స్కూల్, కాలేజ్, ఆఫీస్, ఫ్యాక్టరీలలో మన సహచరులు, మన వద్దకు వచ్చిపోయే ప్రతి ఒక్కరిలో మీకు దగ్గరగా ఉండి మార్గదర్శకం నుండి బహుదూరంగా ఉన్న ప్రతి ఒక్కడూ మీతో ఈ ప్రశ్న అడగవచ్చు : నేను చీకట్లలో ఉండేవాడిని, నీ వద్ద వెలుగు ఉండేది. నేను అపమార్గం వైపు వెళ్తుండేవాడిని, నీ వద్ద రుజుమార్గ చిరునామా ఉండేది. మరి నువ్వేమి చేస్తుండేవాడివి? ఈ రోజు నేను అల్లాహ్ వద్ద ఓటమి పాలయ్యానంటే

నువ్వు దీని బాధ్యత నుండి తప్పించుకోగలవా?

ఈ మూడు దృశ్యాలు కలిసి ఏ సందేశ ప్రచార నమూనా రూపాన్ని ఇస్తున్నాయో దాన్ని మీ జీవితాల్లోనూ స్థిరపరచుకోండి. అవి స్పష్టంగా ఉన్నాయి:

- . . .సందేశ ప్రచారం, ప్రచార ప్రదేశం గురించిన బాధ్యత, స్పృహ కలిగి ఉండటం.
- ... జీవితంలో అన్నింటికీ మించి అల్లాహ్ దాసుల వరకూ దైవసందేశాన్ని చేరవేయాలనే ధ్యాస, ధ్యేయం కలిగి ఉండటం.
- ....ప్రతీక్షణం అల్లాహ్ దాసులతో మనకున్న సంబంధం, వారి మంచిని తలచి, హితబోధ గరిపి, అల్లాహ్ అప్పగింతను చేర్చే విధిని నిర్వర్తించామని వారు సాక్ష్యమివ్వగలరా? అనే ఆలోచన, బెంగ కలిగి ఉండటం.

నా ఆల్బంలో ఎన్నో భాగాలున్నాయి. దృశ్యాలన్నింటినీ నేను అందంగా, ఒక క్రమపద్ధతిలో పేర్చాను. ఇప్పుడు నేను నాల్గవ దృశ్యాన్ని మీకు ఆల్బం రెండవ భాగం నుండి చూపిస్తాను. ఈ దృశ్యమంటే నాకెంతో ఇష్టం. దీనిని నేను మాటిమాటికీ తీసి చూస్తుంటాను. నేను ఎంతోకాలం నుండి దీన్ని నా స్నేహితులకు చూపిస్తున్నానో నాకే తెలియదు. మొదటి మూడు దృశ్యాలు సందేశ ప్రచారానికి సంబంధించిన సుందర దృశ్యాలైతే, ఈ దృశ్యం సందేశ ప్రచార దాతలకు ఎంతో ఆహ్లాదాన్నిచ్చే దృశ్యం.

నాల్గవ దృశ్యం

రాళ్లకు బదులు పూలు పరిచారు

దైవదౌత్యపు పదో ఏట. పదేళ్లు కష్టపడిన తర్వాత కూడా మక్కా నాయకులు, సామాన్య ప్రజలు ఏకైక దేవుని దాస్యాన్ని స్వీకరించి, ఆయన ప్రవక్తను అనుసరించి, మక్కాను సందేశ ప్రచార కేంద్రంగా చేసుకోవడానికి సిద్ధంగా లేరు. పైగా ఇప్పుడు వారు సత్యసందేశ ప్రచారకుడు అయిన దైవ ప్రవక్త (స)నే అంతమొందించాలనే దుష్టాలోచనతో ఉన్నారు. అప్పటి వరకూ బాబాయి అబూతాలిబ్ అండదండలుండేవి. ఆయన పరలోకానికి ప్రయాణమయ్యారు. పాతికేళ్లు ఖదీజా (రజి) తోడూ, సహవాసం ఉండేది. అది కూడా దూరమయ్యింది. మక్కా నగరంలో ఉత్తములైన వారు ఆయన సహచరులయ్యారు. ఇప్పుడు ఏకైక అల్లాహ్ దాస్యం అనే పునాదిపై ఒక సమాజం నిర్మితం కావాలి. ఏకైక దేవుని సర్వాధికారం, ప్రభుత్వం స్థాపించే ఆసనాన్ని వెదకాల్సి వచ్చింది. దైవ ప్రవక్త (స) దీని కొరకు తాయిఫ్ వైపు దృష్టి సారించి అక్కడకు పయనమయ్యారు. మక్కాకు దగ్గరగా ఉన్న నగరమూ ఇదే. పచ్చపచ్చని భూములు, నీటి వనరులు, తోటలతో కళకళలాడుతూ ఉంటుంది తాయిఫ్. బహుశా అక్కడి సర్దారులు, ప్రముఖులైనవారు సందేశాన్ని స్వీకరించవచ్చునే సత్సంకల్పంతో

తాయిఫ్ మార్గం కఠినమైన పర్వతాలు, కనుమలతో కూడుకుని ఉంది. అరబ్బు ఎడారి మండే ఎండ. పైగా వేసవి! యాభై ఏళ్ల వయస్సు. కఠినమైన ప్రయాణం. ప్రయాణ సాధనం కూడా లేదు. అది సమకూర్చుకునే అవకాశమే లేదు. ఎందుకంటే ఉన్నదంతా సందేశ ప్రచార కార్యక్రమంలోనే ఖర్చయింది.

రెండు పాదరక్షకులతోనే కాలినడకన ప్రయాణం. తోడుగా ఆయన (స) వారి దత్తపుత్రుడు, సత్యమార్గంలో ఉన్న నవయవ్వన సహచరుడు హజ్రత్ జైద్ బిన్ హారిస్ (రజి) ఉన్నారు.

తాయిఫ్ చేరుకుని దైవప్రవక్త (స) బనూ సఖీఫ్‌కు చెందిన ముగ్గురు ప్రముఖ సర్దారులు అబ్దెయాలైల్, మసూద్, హబీబ్‌ల వద్దకు వెళ్లి వారి ముందు దైవ సందేశాన్ని ఉంచారు. పదేళ్లు మక్కాలో తిరస్కరణకు గురైన తర్వాత తాయిఫ్ నగరంపై ఉంచుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. అధికారం, ఐశ్వర్యం, సంపదల గర్వాంధకారంలో మునిగి తేలుతున్న ఈ ముగ్గురు సర్దారులు సత్య సందేశాన్ని ధిక్కరించారు. దీనికి బదులుగా వారిచ్చిన సమాధానాలు వారి తలబిరుసుకు తార్కాణాలు.

విరిగిన మనస్సుపై మొదటి బాణం ఇలా గుచ్చుకుంది–

"ప్రయాణానికి గాడిద కూడా లేని నిన్ను ప్రవక్తగా నియమించాడా? దేవుడికి ఇంకెవ్వరూ లభించలేదా?"

రెండవ వాడు దుర్భాషలాడుతూ ఇలా అన్నాడు : "అల్లాహ్ నిన్ను ప్రవక్తగా నియమించి ఉంటే కాబా గృహ పరదాలు చీలికలు పేలికలుగా అయిపోయేవి."

మూడవ వాడు వారితో పాటు ఇలా అన్నాడు : "నేను నీతో అస్సలు మాట్లాడను, ఎందుకంటే ఒకవేళ నువ్వు నిజం గానే అల్లాహ్ ప్రవక్తవి అయితే. నేను నీతో మాట్లాడే అవసరమే లేదు. ఒకవేళ నీవు అలాకాకపోయినట్లైతే అబద్ధాల రాయుడితో మాట్లాడటం నన్ను నేను అగౌరవపర్చుకోవడం వంటిది."

ప్రవక్త (స) గాయపడ్డ మనస్సుతో సర్దారుల సమావేశం నుండి నిష్క్రమించారు. తాయిఫ్ సర్దారులు నగరంలోని తుంటరి పిల్లలు, గూండాలను ఆయన (స) పై పురికొల్పారు. అల్లరి మూకలు ఆయన (స) పై రాళ్ల

వర్షం కురిపించారు. ఆయన (స) పాదాలపై గురిచూసి రాళ్లు విసిరారు. రెండు మైళ్ల వరకూ ఇదే హింస. ఆయన (స) గాయాలతో రక్తసిక్తమయ్యారు. చివరకు తాయిఫ్ నగరం నుండి బయటపడి ఒక తోటలో విశ్రాంతి పొందారు. ఈ దృశ్యాన్ని చూసి బాధపడకుండా ఉండేదెవ్వరు?

గాయాలతో మోకాళ్లు నుజ్జు నుజ్జు అయిపోయాయి. శరీరం రక్తసిక్త మైంది. పిన్న వయస్కుడైన మిత్రుడు (జైద్) స్పృహ కోల్పోయే పరిస్థితులలో ఉన్న ఆయన (స)ను ఎలా కుదిరితే అలా లేపి నీళ్లు ఉన్న ప్రదేశంలోనికి తీసుకువచ్చాడు. పాదరక్షలు తొలగించాలనుకున్నాడు. కాని రక్తసిక్తమైన పాదాలతో అవి అతుక్కుపోయి ఉండిపోవడం వల్ల వాటిని తొలగించడం అసాధ్యమైనది. (మనాజిరె అహ్‌సాన్ గిలానీ, అన్‌నబియ్యుల్‌ఖాతమ్ పేజీ 58)

ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అడిగారు : "ఓ దైవప్రవక్తా! ఉహుద్ రోజు కంటే కఠినమైన రోజు దైన్నైనా మీరు చూశారా? ఆయన (స) ఇలా సెలవిచ్చారు:

నీ జాతి వైపు నుండి బాధలు ఎలాగూ కలిగాయి కాని అన్నింటి కంటే కఠినమైన రోజు ఏదంటే, నేను తాయిఫ్‌లో అబ్దెయాలైల్ ముందు దైవసందేశ ముంచగా అతను తిరస్కరించిన రోజు. (నయీమ్ సిద్దీఖీ, ముహసినె ఇన్సానియత్, పేజీ 196, మూలం : అల్ మవాహిబుద్దునియా)

ప్రవక్త (స) ఎన్నో ఆశలతో కొనసాగించిన తాయిఫ్ ప్రయాణం జీవితంలో అన్నింటికంటే కఠినమైన రోజు. ఈ దృశ్యాలన్నింటినీ దృష్టిలో ఉంచుకోండి, ఇప్పుడు చూడండి నాలుక ఎలాంటి మాటలు పలుకుతుందో!

"దేవా! నా శక్తి విహీనత, నిస్సహాయత, నిరాదరణలను గురించి నీతోనే మొర పెట్టుకుంటున్నాను.

చూడు, నీ సందేశం మానవులలో అగౌరవానికి గురై, ప్రజలలో అవమానపడి, తిరస్కరణకు గురైంది.

నిస్సహాయుల, బలహీనుల స్వామివి నీవే. నీవే నా ప్రభువువు.

నన్ను ఎవరికి అప్పగించావు? నన్ను చూసి హేళన చేసే వారి వశం చేశావా? నా వ్యవహారాలను శత్రువుల వశం చేసేశావా?

అయినా నువ్వు నా పట్ల విముఖుడవుగా లేకపోయినట్టైతే నాకు వీరి మాటలు లెక్కలేదు.

ఏది ఏమైనా నీ ప్రసన్నతలోనే నా సుఖం కలదు.

నీ శరణు కోరుతున్నాను. దీనిలోనే ఉభయలోకాల కల్యాణం దాగి ఉంది.

నీ ఆగ్రహం నుండి నీ శరణు కోరుతున్నాను. నీ ఆగ్రహం విరుచుకు పడకుండా నీ ఛాయలోనికి వచ్చేస్తున్నాను.

ఒప్పించాలి, ఒప్పించాలి, నువ్వు సంతుష్టుడవు అయ్యే వరకూ ఒప్పించాలి.

వశమూ లేదు, శక్తీ లేదు, మహోన్నతుడు, గొప్పవాడు అయిన అల్లాహ్ ఉన్నాడు."

సందేశ ప్రచారం పట్ల కలిగి ఉన్న ప్రేమ, ఆ ప్రేమ పట్ల తాయిఫ్ వైపునకు ఈ కఠోర శ్రమతో కూడిన ప్రయాణం, తన ప్రభువుపై ఉన్న నమ్మకం, ఆయనను సంతుష్ట పరచాలనే తపన. ఆయన (స) ఈ హృదయావస్థను మీరు చూశారు కదా.

వాస్తవానికి ఇందులో మరికొన్ని కోణాలు దాగి ఉన్నాయి. వాటిని వివరించడమే నా ఉద్దేశ్యం.

దైవప్రవక్త (స) వారి ఈ పదాలను విని నవయువకులైన సహచరుడు హజ్రత్ జైద్ బిన్ హారిస్ (రజి) ఇలా విన్నవించుకున్నారు.

ఓ దైవప్రవక్తా! ఆ దౌర్జన్యపరులను శపించండి.

విశ్వకారుణ్యమూర్తి (స) ఇలా సెలవిచ్చారు,

"నేను వారిని ఎందుకు శపించాలి. వీళ్లు అల్లాహ్‌ను విశ్వసించక పోయినా, కనీసం వీరి సంతానమయినా సహవర్తులెవ్వరూ లేని ఏకైక అల్లాహ్‌ను తప్పక విశ్వసిస్తారని ఆశిస్తున్నాను." అన్నారు

ఒక లేఖకుడు ఇలా రాశాడు.

ఈ మాటలు దైవప్రవక్త (స) గారి కరుణాకటాక్షాలకు నిదర్శనాలు. అల్లాహ్ సృష్టిరాశులపై ఆయనకు గల అనంత ప్రేమానురాగాలకు, సహనం, స్థిరత్వాలకు ఆశ్చర్యకరమైన ఒక ఉదాహరణ ఇది. సృష్టిరాశుల పట్ల అంతులేని చింతన, సత్య సందేశంపై ఎనలేని నమ్మకం, ఈ సందేశాన్ని ప్రపంచం వరకూ మూలమూలలకూ చేర్చే ఆదర్శ నమూనా ఈ ఉపదేశంలో దొరుకుతుంది. లోకంలో ఇలాంటి ఉదాహరణ మరొకటి కానరాదు. మానవ జాతిలో ఇలాంటి శ్రేష్టమైన కరుణాకటాక్షాలు కలిగిన మహోన్నత వ్యక్తి ఎవరూ లేరు. ఈ మహోన్నత స్థానానికి ఇతరులెవ్వరూ చేరుకోలేకపోయారు. (అబుల్ కలాం ఆజాద్, రసూలె రహ్మత్, పేజీ : 152)

తోటనుండి బయలుదేరి ఆయన (స) మక్కా దారి పట్టారు. ఇబ్రాహీం కట్టుకునే స్థానం వరకూ చేరుకున్నారు. ఇక్కడకు జిబ్రాయీలె అమీన్ ప్రత్యక్షమై ఇలా విన్నవించుకున్నారు :

మీ జాతి ప్రజలు మీతో అన్న మాటలను, మీ సందేశానికి బదులుగా మీరేమి జవాబు ఇచ్చారో అంతా అల్లాహ్ విన్నాడు.

ఓ ముహమ్మద్ (స) అల్లాహ్ మీ వద్దకు కొండల పర్యవేక్షక దైవ దూతలను పంపాడు. మీకు ఇష్టమొచ్చిన ఆదేశమివ్వండి.

కొండల పర్యవేక్షకుడైన దైవదూత 'సలామ్' చెప్పి, ఆయన (స) అనుమతి కోరాడు.

ఓ ముహమ్మద్ (స) అధికారమంతా మీ చేతుల్లోనే ఉంది. మీరు

ఆజ్ఞాపిస్తే తాయిఫ్ పట్టణానికి ఇరువైపులా ఉన్న రెండు కొండల్ని కలిపేసి ఈ పట్టాణాన్ని నుజ్జు నుజ్జు చేసేస్తాను.

తాయిఫ్ ప్రజలు ప్రవక్త (స) మోకాళ్లు విరిచేశారు. పాదాలు నుజ్జునుజ్జు చేశారు. ఇప్పుడాయన వద్దకు పర్వతాల దైవదూత వచ్చారు. ఎవరైతే ఆయన్ని కించపరిచారో, వారిని నుజ్జునుజ్జు చేయగలరు. తలచుకుంటే ఇది చేయగలిగే వారే. తనపై రాళ్ళ వర్షం కురిపించిన వారిని శిక్షించే హక్కు ఆయనకు పూర్తిగా ఉంది. (గిలాని, అన్ నబియ్యుల్ ఖాతమ్ పేజీ : 65-67)

నూహ్ జాతిపై తుఫాను, ఆద్ జాతిపై గాలి దుమారం, సమూద్ జాతిపై ఉరుములు, మెరుపులు, లూత్ జాతిపై రాళ్ల వర్షం, మూసా (అ) జాతి వారి సముద్రపు వృత్తాంతాల రికార్డు ఉంది కదా. కాని, ప్రవక్త (స) దైవదూతతో ఇలా అన్నారు.

"నేను నిరాశ చెందలేదు. వారి తరువాతనే వారి జాతి నుండి ఎలాంటి వారిని అల్లాహ్ జనింపజేస్తాడంటే వారు సహవర్తులెవ్వరూ లేని ఏకైక అల్లాహ్ దాస్యాన్నే చేస్తారు."

ఈ మాటలతో తాయిఫ్ దృశ్యం ఎంతో అందంగా మారింది. తన ప్రభువు దాసుల పట్ల ఆయనకు ఎంతగా అనుగ్రహం, ఎంత కారుణ్యం.

తమ సొంతవారిని అందరూ ప్రేమిస్తారు. కానీ, శత్రువులను ఎంత మంది ప్రేమిస్తారు? మంచి మాటలకు అందరూ మంచిగానే సమాధాన మిస్తారు. కానీ దూషణలు, రాళ్లకు బదులుగా ప్రార్థనలు ఇచ్చేవారు ఎంతమంది ఉన్నారు? ప్రతీకారం తీర్చుకునే కాంక్షలేదు, ద్వేషము లేదు, కోపతాపాలు లేవు, క్రోధము, ఆగ్రహమూ కలుగలేదు, దుర్భాష దూషణలు లేవు, తనపై తనకు గర్వమూ లేదు, అధికారమున్నా దాన్ని దుర్వినియోగపర్చలేదు, వీటికి బదులుగా వారి హృదయం బాధాతప్తంగా మారి, సానుభూతి, ప్రేమావాత్స ల్యాలు ఉట్టిపడుతున్నాయి. అధికార బలాన్ని ఉపయోగించకుండా దుర్మార్గాన్ని, కలహాలను వేళ్లతో పీకిపారేయడం అధికారబలాన్ని అతి తక్కువగా అవసరానికి

తగినంతగా ఉపయోగించారు. సత్యసందేశాన్ని విని లబ్బైక్ అంటూ వెంటవచ్చే వారు నేడు కాకపోయినా రేపు జన్మిస్తారన్నదే ఆయన (స) అభిలాష.

ఈ దృశ్యం నాకు ఎల్లప్పుడూ గుర్తుకొస్తూనే ఉంటుంది. వివాదాల్లో వాదోపవాదాలు- పోట్లాటల్లో సాధారణంగా ఈ దృశ్యాన్ని మనం పూర్తిగా మర్చిపోతుంటాము. మన పోరాటం కేవలం రోగంతోనే కాని రోగితో కాదు అన్న విషయాన్ని మనం పెడచెవిన పెడ్తుంటాము. మనకు ద్వేషం ఉంటే అది చెడుగు, దుష్కార్యాలతోనే కాని దుర్మార్గపు మనుషులతో కాదనేది నిర్వివాదాంశం.

ప్రేమ, మృదుత్వం, కారుణ్యం, హృదయవేదన. ధైర్యం, సహనం. మీలోనూ ఉన్నాయా? మీలో తిట్లను, రాళ్లను సహించే బలం ఉందా? వాటికి సమాధానం దుఆలతో ఇవ్వగలరా? మార్గంలో ముళ్లు పరిస్తే మీరు పువ్వులు వర్షిస్తారా? మిమ్మల్ని ధిక్కరించినా ఇంకా మీరు ఆశాభావంతో ఉన్నారా? మిమ్మల్ని తృణీకరించినప్పుడు మీరు వెళ్లి కలుస్తారా? మీపై దౌర్జన్యం జరిగితే మీరు క్షమించేస్తారా?

చెడుకు బదులుగా మంచితో సమాధానమివ్వడమనేది అత్యంత సులభమైన పని కాదు అనేది నిజమే! కాని దైవ సందేశ ప్రచారానికి, సత్కార్యాలు, సత్కర్మలు సల్పుట, ఇస్లాంపై స్థిరంగా ఉండటానికి ఇది అత్యంత ఆవశ్యకమైనది. ఈ విలువైన సంపద అదృష్టవంతులకే దొరుకుతుంది. 'సహనం' అనే విశిష్ట గుణం కలిగి ఉన్నవాడే అదృష్టవంతుడు.

ఒక నిజమైన మాట మీతో మచ్చటించనా - ఇలాంటి మహోన్నత ఆశయం, ఇదే ప్రేమ, కారుణ్యం లేనంత వరకూ ప్రజల హృదయాలు గెలవడం సాధ్యంకాదు. సందేశ ప్రచారకుడికి వ్యక్తిగతమైన ప్రత్యర్థులు, శత్రువులు ఉండరు, కక్షలు, కార్పణ్యాలు అసలే ఉండవు. వారు కేవలం మంచి కొరకే పోరాడతారు. అంతటి పోరాట పటిమగలవారు 'సందేశ ప్రచారకులు'

ఇప్పుడు నేను నా ఆల్బంలోని మూడవ భాగం నుండి మూడు దృశ్యాలు మీకు చూపిస్తాను. ఈ దృశ్యాలలో పూర్తి సందేశ ప్రచార కార్యం ఇహపరలోకాలలో ఏ లక్ష్యం వైపునకు తీసుకువెళ్తుందో మీకు ప్రస్ఫుటమౌతుంది.

ఐదవ దృశ్యం

దైవదాస్యమే జీవిత పరమార్థం

మక్కా నుండి మదీనా వైపు ప్రయాణ మార్గం మధ్యలో ఒక చిన్న పట్టణం వస్తుంది. దాని పేరు బదర్. ఇక్కడి నుండి దారి బహరె అహ్మార్ సముద్రతీరం నుండి మలుపు తిరిగి మదీనా వైపునకు మళ్లుతుంది. అక్కడి నుండి కొంత దూరంలో నలువైపులా చిన్న చిన్న పర్వతాలు, మధ్యలో ఒక బావి, ఎడారి, ఇసుక మైదానం ఉన్నాయి. హిజ్రీ శకం రెండవ సంవత్సరం, ఈ మైదానంలో మానవ విలువలకు మరోసారి ప్రాణం పోసిన పోరాటం జరిగింది. ఆ సమయంలో ఒకవైపు అజ్ఞానానికి కేంద్రబిందువైన మక్కాకు చెందిన పెద్ద పెద్ద సర్దారులందరి అపారమైన యుద్ధసామాగ్రి సాధనా సంపత్తి, మరోవైపు దైవ సందేశంపై పదిహేనేళ్లు స్థిరంగా నిలకడగా ఉన్నవారి విశ్వాసబలం మొండుగా ఉంది. మానవత్వానికి పునాదులైన వారు అందులో చాలామంది ఉన్నారు. మక్కాలో విశ్వసించిన ఆణిముత్యాలు, మదీనాలో విశ్వాస పిలుపునకు లబ్బైక్ అన్నవారూ ఉన్నారు. అవిశ్వాసుల వద్ద అసత్యాన్ని గెలిపించడానికి వెయ్యి మంది సైన్యం ఉంది. వారి వద్ద గుర్రాలకు, ఖడ్గాలకు ఎలంటి కొదువా లేదు. కానీ విశ్వాసుల వద్ద సత్యాన్ని సంరక్షించడానికి 313 మంది మాత్రమే ఉన్నారు. వీరి వద్ద కేవలం రెండు గుర్రాలు, ఖడ్గాలు కూడా తక్కువ సంఖ్యలోనే ఉన్నాయి.

బదర్‌లో ఒక ఎత్తైన గుట్టపై హజ్రత్ సాద్‌బిన్ మాజ్ (రజి) ఒక గుడారాన్ని వేశారు. అందులోనికి దైవప్రవక్త (స) తమ గుహ సహచరులైన హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి)తో కలిసి విచ్చేశారు. రాత్రి అవగానే దైవప్రవక్త (స) వారి ప్రాణాలు కాపాడేందుకు తెగించి పోరాడే శూరులైన సహచరులు తియ్యని నిద్రలోకి జారుకున్నారు. వారందరూ భయభ్రాంతుల నుండి విముక్తి

పొంది, శాంతి సహనాల అవస్థలో ఉండాలని అల్లాహ్ వారికి ఈ నిద్రను కలుగజేశాడు. కాని దైవ ప్రవక్త (స) గారికి నిద్ర ఎలా పడ్తుంది? ఈ సందేశ ప్రచార కార్యం నిర్వహించడానికి ఆయన (స)ను ఈ భూమిపైకి పంపిన ఆ ప్రభువు ముందు నిలబడి ఉన్నారు. కొంత సమయం చేతులు కట్టుకుని నిలబడి ప్రార్థిస్తున్నారు. మరికొంత సమయం భూమిపై నుదుటిని ఆన్చి సజ్దాలో ఉండిపోతున్నారు.

అది వింతైన దృశ్యం. ఈ విశాల భూ మండలంలో ఏకేశ్వరోపాసన (తౌహీద్) చేసే అదృష్టం, భవిష్యత్తు కేవలం కొందరికేదక్కుతుది. దైవ ప్రవక్త (స)పై అత్యధిక వినయ, విధేయతల అవస్థ కమ్ముకుంది. ఆయన (స) రెండు చేతులెత్తి ఇలా వేడుకున్నారు :

'ప్రభువా! నీవు నాతో చేసిన వాగ్దానాన్ని పూర్తి చెయ్యి'

ఒడలు మరిచి, ఆలోచనల్లో నిమగ్నమైన అవస్థలో, దుప్పటి భుజాలపై నుండి పడిపోతూ ఉండేది. అయినా ఆయన (స)కు ధ్యాసే ఉండేది కాదు. సజ్దాలో ఉండి ఇలా పలికేవారు, "ఓ అల్లాహ్! ఈ కొన్ని ప్రాణాలు కూడా ఈ రోజు అంతమైపోతే ఇక ప్రళయం వరకూ నిన్ను ఎవరూ ఆరాధించరు". (షబ్లీనోమానీ, సీరతున్నబీ, మొదటిభాగం, పేజీ : 321)

దైవంపట్ల ప్రవక్త (స)కు ఉన్న భక్తి, ప్రేమ, ఆయన ఆరాధనాశైలి సాటిలేనివి, అనిర్వచనీయమైనవి. అయితే ఇక్కడ మనం గమనించవలసిన మరో విషయం ఏమంటే, "ఈ కొన్ని ప్రాణాలు ఈ రోజు అంతమైపోతే ప్రళయం వరకూ నీకు దాస్యం చేసేవారు ఉండరు". అంటూ ప్రార్థించారు ప్రవక్త (స).

"ఈ రోజు వీళ్లకు జీవనం ప్రసాదిస్తే, వీళ్ల, వీరి తర్వాతి తరాల ప్రతీ శ్వాస, ప్రతీ మానవుడిని నీ దాస్యం వైపునకు తీసుకురావడానికి అంకితమై పోతుంది". అన్న వేడుకోలు కూడా అందులో ఉంది. ఈ దుఆలో ప్రార్థన, వేడుకోలు, మనవి, ఆశ, ఒక లక్ష్యం, వ్యక్తీకరణ, ఒక ఒప్పందం ఉన్నాయి. ముస్లిం సమాజం (ఉమ్మత్) లేకపోతే రాజ్యాలు ఉండవని, సైన్స్, టెక్నాలజీలు

ఉండవని, సిరిసంపదలు, పాడిపంటలు ఉండవని ఏమాత్రం చెప్పలేదు. ఇవన్నీ ఉంటాయి. కానీ మానవులకు సర్వసృష్టికర్తతో దాస్య సంబంధం తెగిపోతుంది. ఇదే స్థితిలో వారి ఆత్మలు వారి శరీరాల నుండి వేరైపోతాయి. అలాంటప్పుడు మానవుడు సాధించిన ప్రగతి అతని జీవిత సాఫల్యం వైపునకు కాక వినాశకారి అవుతుంది. చివరకు దైవప్రవక్త (స) ప్రార్థనల ఫలితంగా అల్లాతో ఈ ఒప్పందం కుదిరింది. సంధి పక్కాగా కుదుర్చుకున్నారు. బదర్‌లో విజయభేరి మోగింది.

ఆ సమయాన్ని గుర్తుకు తెచ్చుకోండి : అప్పుడు మీరు లోయకు ఈ ప్రక్కన ఉన్నారు. వారు ఆ ప్రక్కన మకాము చేశారు. మీకు క్రింది (ఒడ్డు) వైపున బిడారు ఉంది. ఒకవేళ మొదటే మీకూ వారికీ మధ్య యుద్ధం చెయ్యాలి అనే తీర్మానమే జరిగి ఉండినట్లయితే, మీరు తప్ప కుండా ఈ సందర్భంలో ఆ తీర్మానాన్ని పాటించకుండా దాటవేసి ఉండేవారు. కాని జరిగింది ఏదో అది అల్లాహ్ తాను తీసుకున్న నిర్ణ యాన్ని అమలుపరచటానికి జరిగింది, నశించవలసినవాడు స్పష్టమైన నిదర్శనంతో నశించాలని, జీవించవలసినవాడు స్పష్టమైన నిదర్శ నంతో జీవించాలని జరిగింది. నిశ్చయంగా అల్లాహ్ వినేవాడూ తెలిసినవాడూనూ. (అన్‌ఫాల్ 8:42)

అందువల్లనే బదర్ దినాన్ని 'అల్‌ఫర్‌ఫాన్' అని కూడా అంటారు.

ప్రవక్త (స) జీవితంలోని ఈ దృశ్యాన్ని చూసి మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. మనం కూడా దేవునిపట్ల వినయ విధేయతలతో, జీవిత సాఫల్యం కొరకు దుఆ చేయడానికి ఈ మార్గంలో నడుస్తున్నామా? భూమి ప్రాతినిధ్యపు బాధ్యత, సత్య సందేశాన్నదించే వాగ్దానం, భయ విముక్తి, శాంతి వాగ్దానం, విశ్వాసబలం, సత్కార్యాల ఆయుధాలు ధరించిన వారి పరిస్థితి ఇలా ఉండాలి.

"కేవలం నా దాస్యమే చేస్తారు, ఎవరినీ నాకు భాగస్వాములుగా నిలబెట్టరు" (అన్‌నూర్ 24:55)

ఆరవ దృశ్యం

గమ్యాన్ని చూపే అడుగుజాడలు

దైవ సందేశ ప్రచారం ఆరంభకాలమది. అప్పటి వరకూ అతి తక్కువ మంది మాత్రమే ప్రవక్త (స) చేతిలో చెయ్యి వేసి విధేయత, అనుసరణ, జిహాద్, ప్రాణాలు ఒడ్డి పోరాడే శపథాన్ని తీసుకున్నారు. కానీ వారిపై కష్టాలు కడగండ్ల పర్వతాలు విరుచుకుపడ్డాయి. ఒకరిని వేడి వేడి ఇసుక నేలపై బోర్లాపరుండబెట్టి పైన బండరాయి పెట్టేస్తే, మరొకరిని తాళ్ళతో కట్టి సంకెళ్ళతో బంధించి వీధుల్లో ఈడ్చుకుంటూ పోయారు. మరొకరిని నిప్పులపై పడుకోబెట్టారు. ఇలాంటి దుర్ఘటనలు ఎన్నో.. ఎన్నెన్నో...

వారిలోనే ఒకరు హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అల్ అరాత్ (రజి) కూడా ఉన్నారు. వారిని వీపున కొవ్వు కరిగి నిప్పులను ఆర్పేంత వరకు నిప్పులపై పరుండబెట్టడం జరిగింది. ఒకసారి ఆయన (రజి) దైవప్రవక్త (స) వారి సన్నిధిలో హాజరయ్యారు. ఈ దృశ్యాన్ని ఆయన మాటల్లోనే చూడండి :

దైవ ప్రవక్త (స) కాబా గృహ ఛాయలో గోడకు ఆనుకుని ఆసీనులై ఉన్నారు. ఆయన (స) తలకింద దుప్పటి ఉన్నది. నేను ఆయన (స)తో ముషైబ్‌ను నిందిస్తూ, నా దురవస్థను తెలుపుతూ ఇలా విన్నవించుకున్నాను. "మీరు మా కొరకు సహాయాన్ని వేడుకోరా? మీరు మా కొరకు దుఆ చెయ్యరా?"

నా ఈ మాటలను విని ఆయన (స) నిటారుగా కూర్చున్నారు. ఆయన (స) ముఖం ఎర్రబడిపోయింది. ఆయన (స) ఇలా సెలవిచ్చారు :

మీకు పూర్వం గతించిన వారి పరిస్థితి ఎలాగుండేదంటే, ఓ విశ్వాసిని

పట్టుకొని భూమిని తవ్వి అతణ్ని అందులో నిలువునా పాతేవారు. ఆ తరువాత రంపం తెచ్చి అతని తలపై పెట్టడం జరిగేది. అలా దానితో అతడి తలను రెండు ముక్కలుగా చీల్చేసేవారు. మాంసం, ఎముకల్లో ఇనుప దువ్వెనలు గుచ్చి అతని మాంసాన్ని, ఎముకల్ని వేరు చేస్తూ దువ్వేవారు. అయినప్పటికీ ఇదంతా అతణ్ణి సత్యధర్మం నుండి వెనక్కు మరలేటట్లు చేయలేకపోయేది.

"దైవం సాక్షిగా చెబుతున్నాను, అల్లాహ్ ఈ కార్యాన్ని సంపూర్ణం గావిస్తాడు. చివరకు ఓ బాటసారి తన వాహనంపై ప్రయాణం చేస్తూ యమన్‌లోని 'సన్‌ఆ'నుండి 'హజర్ మౌత్' వరకూ నిరాటంకంగా ప్రయాణం కొనసాగిస్తాడు. అతనికి దైవభీతే తప్ప, అతని గొర్రెలపై తోడేలు విరుచుకుపడు తుందేమోనన్న భయం తప్ప మరెవ్వరీ భయమూ ఉండదు. కాని మీరు తొందరపడుతున్నారు." (బుఖారి, ముస్లిం)

ప్రపంచంలో ఈ సందేశ ప్రచార లక్ష్యాన్ని మీ విజ్ఞానం, తెలివితేటల దృష్టితో చూడండి. ఒకవైపు ఏకైక అల్లాహ్ దాస్యం స్థాపించబడితే, మరోవైపు దీని పర్యవసానంగా ఒక మానవుడు, మరొకడిపై దౌర్జన్యం చేయలేని సమాజ నిర్మాణం జరుగుతుంది. ఒక మేక దూరంగా బీడుపడిన ప్రదేశంలో ఆకలితో చనిపోతుందేమోనని అధికారులు కంపించిపోయే పరిస్థితులు రాను, రానూ నెలకొంటాయి.

మన సందేశ ప్రచార గమ్యం ఈ అడుగుజాడల్లో నడుస్తుందో, లేదో ఆలోచించండి. ఎందుకంటే దైవ ప్రవక్తల సందేశం, ఉద్యమం దీని సారాంశమే. "కేవలం అల్లాహ్‌కే దాస్యం చెయ్యండి", ప్రతీ ఒక ప్రవక్త తమ జాతివారికి వారి కాలాలలో ఇదే బోధించారు. సమస్త దైవ సందేశహరులను గురించి దివ్యగ్రంథం ఖుర్‌ఆన్‌లో ఇలా తెలుపబడింది.

"మేము మా ప్రవక్తలను స్పష్టమైన సూచనలతో, హితోపదేశాలతో

పంపాం. వారితో పాటు గ్రంథాన్నీ, త్రాసునూ అవతరింపజేశాము, ప్రజలు న్యాయంపై స్థిరంగా నిలబడాలని" (అల్ హదీద్ 57:25)

రాజకీయ బలం, న్యాయం, జిహాద్‌లను అల్లాహ్, ఆయన ప్రవక్తకు సహాయపడేవిగా పేర్కొన్నారు.

"ఇనుమునూ దింపాము అందులో మహత్తరమైన శక్తి ఉన్నది, ప్రజలకు ప్రయోజనాలూ ఉన్నాయి. ఇలా ఎందుకు చేయబడిందంటే, ఆయనను చూడకుండానే ఎవడు ఆయనకూ, ఆయన ప్రవక్తలకూ సహాయపడతాడో అల్లాహ్‌కు తెలియాలని" (అల్ హదీద్ 57:25)

ఏడవ దృశ్యం

రేపటి వాగ్దానం తీసుకు వెళ్లారు

మీ కొరకు, నా కొరకు ఈ సందేశ ప్రచార కార్యం నిజమైన బహుమానం. ఈ న్యాయవంతమైన సమాజ స్థాపన కంటే మరేదీ ప్రీతికరమైనది కాదు. ప్రజలు ఏకైక అల్లాహ్ దాస్యాన్ని స్వీకరించినా లేక తిరస్కరించినా, ధర్మం, న్యాయం అనే పునాదులపై నిర్మించిన సమాజం ఉనికిలోనికి వచ్చినా రాకపోయినా, మన ఈ బహుమానం, మనలో సాధన సంపత్తి పూర్తిగా నికరమైనవి, సత్యమైనవి. ఇవి మన చేజారిపోయే ప్రసక్తే లేదు. ఇవే మన నిజమైన సాఫల్యానికి కారణాలు. ఆ లక్ష్యమే నరకాగ్ని నుండి విముక్తి పొంది స్వర్గాన్ని పొందడం.

> **'మీలోని ఎవరి శ్రమనూ నేను వృథాగా పోనివ్వను. పురుషుడైనా స్త్రీ అయినా మీరంతా ఒకే రాశికి చెందినవారు. కనుక నా కొరకు తమ దేశాన్ని విడిచిపెట్టిన వారు, నా మార్గంలో తమ గృహాల నుండి గెంటివేతకు గురైనవారు, హింసకు గురైనవారు, నా కొరకు పోరాడి మరణించిన వారు -అటువంటి వారి తప్పులన్నింటినీ నేను క్షమిస్తాను. క్రింద సెలయేళ్లు ప్రవహించే ఉద్యానవనాలలోకి వారిని ప్రవేశింపజేస్తాను. (దివ్యఖుర్ఆన్ 3:195)**

తాము చూడని స్వర్గం కొరకు పూర్తి జీవితాన్ని పైకంగా చెల్లించి దీన్ని పొందాలనే ఆకాంక్ష తమ సమస్తాన్ని ఖర్చుపెట్టిన, దీని వైపు వేగంగా పరుగులిడిన వారి దృశ్యాలు మరియు ఇహలోకంలోనే దీని సువాసనను ఆస్వాదించిన, దీని అనుగ్రహాల వైపు చెయ్యిచాపిన మహనీయులైన వారి దృశ్యాలు నా ఆల్బంలో ఎన్నో ఉన్నాయి. కానీ వాటినన్నింటినీ ఇప్పుడు మీకు

చూపించడం అసాధ్యం. మళ్లీ ఇలాంటి సదవకాశం దొరికినప్పుడు ఆల్బంలోని ఈ భాగాన్ని మీకు పూర్తిగా చూపిస్తాను. (ఇన్షాఅల్లాహ్)

ఈ కొన్ని దృశ్యాలు చకచకా చూసేయండి

ఈయన అనస్ బిన్ నస్ర్ (రజి) ప్రవక్త (స) అనుచరుడు. దైవప్రవక్త (స) అమరగతి (షహాదత్) పొందారనే వదంతిని విని కూడా, ఉహుద్ పర్వతం నుండి వచ్చిన స్వర్గ సువాసనతో ఆఘ్రాణించి ధైర్యం సన్నగిల్లకుండా గాయాలతో నుజ్జునుజ్జయిన శరీరంతోనే వీరోచితంగా అవిశ్వాసులతో పోరాడిస్వర్గం వైపునకు ప్రయాణమయ్యారు.

ఈయన ఆమిర్ బిన్ హమ్మామ్ (రజి). స్వర్గం వైపునకు వేగంగా దుమకమన్న సందేశం విన్నంతనే చేతిలో ఉన్న ఖర్జూరాలు కూడా తినే ఓపిక ఆయనకు లేకపోయింది. ఖర్జూరాలు విసిరేసి స్వర్గం వైపునకు దుముకుతూ వెళ్లిపోయారు.

ఈయన హరామ్ బిన్ మల్హాన్ (రజి). యుద్ధ మైదానంలో శత్రువు ఈయనపై వెనుక నుండి బాణం విసిరాడు. విలవిలలాడుతూ నేలపై ఒరిగి ప్రాణాలు పోవడానికి ముందు ఆయన ముఖం అత్యధిక సంతోషంతో ఎర్ర బడింది. విజయం, సాఫల్యం ఆయన కళ్లముందు నాట్యమాడాయి. పెదాలపై ఈ పదాలున్నాయి : కాబా ప్రభువు సాక్షి! నేను సఫలీకృతు డినయ్యాను.

ఈయన అబుల్ దహ్దా (రజి) స్వర్గంలో ఆయనకు తోట లభిస్తుందని ఎంతగా నమ్మకం ఉందంటే, దానిని ఎంత విలువైనదిగా భావించారంటే తమ దగ్గర ఉన్న విలువైన తోటను ఒక అనాథ బాలుడికి ఇచ్చి ఆ తోటను తీసేసుకున్నారు. ఆ బాలుడికి తోటను ఇచ్చే సమయాన ఆయన మనస్సు సంతోషంతో నిండిపోయింది.



దైవప్రవక్త (స) వారి ఈ దృశ్యాన్ని 'అల్ ముసవ్విర్' (సృష్టికి రూపాన్నిచ్చేవాడు) చిత్రీకరించి మనకు అందజేశారు.

ఎనిమిదవ దృశ్యం:

హృదయాల విజేత..

"(ప్రవక్తా!) అల్లాహ్ యొక్క అనంతకరుణ వల్లనే నీవు వారిపట్ల మృదుస్వభావి అయ్యావు. నీవేగనక కర్కశుడవు, కఠిన హృదయుడవు అయినట్లయితే వారందరూ నీ చుట్టుపక్కలనుండి దూరంగా పోయేవారు. వారి తప్పులను మన్నించు, వారిని క్షమించు అని అల్లాహ్‌ను ప్రార్థించు. ధర్మానికి సంబంధించిన పనిలో వారిని కూడా సంప్రదించు." (ఆలి ఇమ్రాన్ 3:159)

చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు, కారుణ్యం కలవాడు.

(అత్ తౌబా 9:128)

చూడండి! జమాఅత్‌ను కలిపి ఉంచేది కేవలం సందేశ ప్రచార ధ్యేయం ఒక్కటి మాత్రమే కాదు, సందేశ ప్రదాత హృదయం, స్వభావం, వ్యవహారశైలి మృదువుగా ఉండాలి. ఇది నిస్సందేహంగా అల్లాహ్ బహుమానమే. ఈ గుణగణాలు లేకపోయినట్లైతే ప్రజలు కల్సిరావడానికి బదులుగా దూరంగా పారిపోయి ఉండేవారు.

ఈ కారుణ్యం, వాత్సల్యాల గుణగణాలను మన కళ్లముందుకు తీసుకు వచ్చి వ్యక్తీకరించడానికి స్వయంగా అల్లాహ్ ఈ రెండు పదాలను ఉపయోగించాడు. అవి ఆయన (స) గుణగణాలను ప్రతిబింబిస్తాయి. అనగా

రవూఫ్ (అమిత దయ కలవాడు), రహీమ్ (అనంత కరుణామయుడు). ఈ కారుణ్యం, దయల పర్యవసానం వల్లే ఆ బలం సమకూరింది. ఫలితంగా వంద సంవత్సరాలలో అట్లాంటిక్ మహాసముద్రం నుండి హిందూ మహా సముద్ర తీరం వరకూ, యూరప్ నుండి చైనా వరకూ ఇస్లాం సందేశాన్ని చేరవేసి ఇస్లాంను మహోన్నత శిఖరాలకు చేర్చగలిగారు ముహమ్మద్ (స).

తొమ్మిదవ దృశ్యం

దోషిని క్షమించి వదిలి వేశారు :


ఇందులోని రెండవ దృశ్యం కూడా చాలా అందంగా ఉంది. ఖురైషీయులు హుదైబియా ఒప్పందాన్ని ఉల్లంఘించారు. దైవప్రవక్త (స) ఇంకా ఒప్పందాన్ని కొనసాగిస్తున్నారా? లేదా? అనే సందిగ్ధంలో పడి ఉన్నారు. మక్కాలోని దైవ గృహాన్ని రక్తపాతం లేకుండా వశపరుచుకునే సువర్ణ అవకాశం ఇంది. ఉన్నందువలన దైవప్రవక్త (స) గుట్టుచప్పుడు కాకుండా గుప్తంగా సన్నాహాలు జరుపుతున్నారు. హజ్రత్ ఖాతిబ్ (రజి) అనే ఒక బదర్ సహచరులు ఉండేవారు. వారి బంధువులందరూ మదీనాలో ఉన్నారు. తన బంధువులకు యుద్ధ సన్నాహాలను గురించి తెలియపరిస్తే వారు తమ ప్రాణాలు కాపాడు కుంటారని తలచి వారికి పత్రాన్ని రాసి ఒక స్త్రీ చేత పంపించేశాడు. దైవప్రవక్త (స) వారి విజయం ఖాయమైనదే. ఈ సూచన వల్ల ఎలాంటి నష్టమూ వాటిల్లదు.

విశ్వకారుణ్యమూర్తి, అమిత వాత్సల్యమూర్తి మక్కా ప్రజలందరికీ, 'ఈ రోజు మీపై ఎలాంటి ఆరోపణ లేదు' అని బాహాటంగా ప్రకటించబోతున్నారని, అల్లాహ్ తన దైవప్రవక్త (స)కు తన గుప్త పత్రం గురించి తెలియజేస్తాడన్న దృశ్యాలను ఆయన (రజి) కళ్లు ఊహించలేకపోయాయి.

దైవప్రవక్త(స)కు వహీ (దైవ వాణి) ద్వారా ఈ విషయం తెలియగానే వెంటనే సహచరులను ఆమె వెనుక పరుగెత్తించారు. ఆ మహిళ పట్టుబడి, ఉత్తరం బయటపడింది. హజ్రత్ ఖాతిబ్ (రజి) కేసును దైవప్రవక్త (స) దర్బారులో ఉంచారు. ఆయన (రజి) తమ తప్పును ఒప్పుకున్నారు. ఆయన

(రజి)కు ఏ శిక్ష విధించాలనే చర్చ మొదలయ్యింది. ఏ న్యాయవ్యవస్థ పరంగానైనా ఇది విశ్వాస ఘాతుకంగానే పరిగణిస్తారు. హజ్రత్ ఉమర్ (రజి) తల నరికేయాలని సలహా ఇచ్చారు. కాని తీర్పు ఇవ్వాల్సిన వ్యక్తిత్వం విశ్వకారుణ్య మూర్తిది. ఆయన (స) ఖాతిబ్ (రజి) చేసిన ఘోరమైన అపరాధాన్ని క్షమించివేశారు.

జమాఅత్‌లు కాఠిన్యం, నిర్ణయాలతో ఏర్పడవు. వీటి వలన బలమూ సమకూరదని పై దృశ్యం సూచిస్తుంది. కొన్ని సార్లు కల్లోలాన్ని నివారించడానికి, దౌర్జన్యం నుండి ప్రజలను కాపాడటానికి, చెడుల నుండి చక్కదిద్దడానికి, జగడాలను రూపుమాపడానికి కఠినత్వం వహించడం అవసరం. అయితే జమాఅత్‌లను మహోజ్వలం చేయగల శక్తి-మన్నింపు, కారుణ్యం, ప్రేమలకే ఉన్నాయి. ప్రేమే ప్రజల హృదయాలను గెలుచుకునే సాధనం. ఇప్పుడు ఈ దృశ్యాన్ని ముందుంచుకుని మనం ఒకరి పట్ల మరొకరు కలిగి ఉన్న వైఖరిని చూడండి. మనం ఈ నమూనాకు ఎంత దగ్గరలో ఉన్నామో, లేక ఎంత దూరంలో ఉన్నామో గుర్తించి విచారించుకోండి.



మన్నింపు, వాత్సల్యం, కారుణ్యంతో కూడిన ఇలాంటి దృశ్యాలు నా వద్ద లెక్కలేనన్ని ఉన్నాయి. వాటిని కొద్ది సమయంలో చూపించడం అసాధ్యం. కాని ఈ రెండు దృశ్యాలు చూడండి. ఇవి విద్యాబోధన, శాసనాల అమలులో కారుణ్యం, మెతకవైఖరిని స్పష్టం చేస్తున్నాయి.

పదవ దృశ్యం

ప్రియమైన బోధకుడు

దైవ ప్రవక్త (స) మస్జిదె నబవీలో ఆసీనులై ఉన్నారు. సహాబాలు కూడా ఆయన (స)తో పాటు కూర్చుని ఉన్నారు. ఒక ఆరాబి అక్కడకు విచ్చేశాడు. గులకరాళ్ల నేల ఉంది. అతను అక్కడ నిల్చుని మూత్ర విసర్జన చేయడం ప్రారంభించాడు. మస్జిద్‌లో మూత్ర విసర్జన! సహాబాలు అతన్ని ఆపడానికి పరుగెత్తారు. బహుశా కొట్టే వారే. దైవప్రవక్త (స) ఇలా ఆదేశించారు.

అతన్ని వదిలేయండి.

అతడు పని పూర్తి చేసుకున్నాడు.

విసర్జన పూర్తి చేసిన తర్వాత అతన్ని తమ వద్దకు దగ్గరగా పిలిచి ఎంతో ప్రేమా వాత్సల్యాలతో "మస్జిద్ ఒక పవిత్ర స్థలం, ఇక్కడ మూత్ర విసర్జన నిషిద్ధమైనది. ఇది అల్లాహ్‌ను స్మరించే, నమాజ్, ఖుర్‌ఆన్ పఠించే ప్రదేశం" అని వివరించారు ప్రవక్త (స).

తర్వాత ఆయన (స) తమ సహచరులతో ఇలా అన్నారు :

దీనిపై ఒక చెంబుడు నీళ్లు వేసి శుభ్రపరచండి. మిమ్మల్ని కఠినత్వం వహించేవారుగా కాదు, మృదు వైఖరి అవలంబించే వారుగా చేశారు.

ఒక వ్యక్తి చేదలో నీళ్ళు తీసుకుని వచ్చి అశుద్ధాన్ని కడిగి శుభ్రపరిచారు. (బుఖారి, ముస్లిం)

మన చుట్టూ ఉన్న ప్రజలు తప్పిదాలు చేస్తుంటే మనం వారికి హితబోధ గరిపేటప్పుడు ఈ విధంగా శాంతి సహనాలు, కరుణా వాత్సల్యాలు చూపుతున్నామా?

పదకొండవ దృశ్యం

ఆయనలాంటి మిత్రుడు, వైద్యుడు ఎక్కడా దొరకరు

ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరై నేను 'సర్వనాశన మయిపోయాను' అని అన్నారు.

ఎందుకు? అని అడిగారు.

'నేను రమజాన్ మాసంలో నా భార్యతో సంభోగంలో పాల్గొన్నాను' అని అన్నారు.

ఆయన (స) ఇలా సెలవిచ్చారు : 'ఒక బానిసకు స్వేచ్ఛను ప్రసాదించు'.

'నేను బీదవాడిని, బానిసను ఎక్కడి నుండి తీసుకురాను? అన్నారు.

ఇలా సెలవిచ్చారు : 'రెండు నెలలు ఎడతెగకుండా ఉపవాసాలు పాటించు'

'ఇదీ నా వల్ల కాదు' అని అన్నాడు ఆ వ్యక్తి.


ఇలా సెలవిచ్చారు : 'అరవైమంది బీదలకు అన్నం పెట్టు' 'అంతటి స్థోమత లేదు' అన్నాడు.

యాదృచ్ఛికంగా ఎవరో ఒక ఖర్జూరపు తట్టను కానుకగా పంపారు. 'వీటిని బీద వారికి దానం చేసిరా' అని అన్నారు ప్రవక్త (స).

'మిమ్మల్ని సందేశహరుడిగా నియమించిన దైవం సాక్షి! మదీనా అంతటిలో నన్ను మించిన బీదవాడు ఎవడూ లేడు' అని అన్నాడు ఆ వ్యక్తి.

ఈ మాటలు విని ఆయన (స) పెద్దగా నవ్వేశారు. తర్వాత ఇలా సెలవిచ్చారు 'అయితే నువ్వే స్వయంగా తిను' అన్నారు.

(బుఖారి, షిబ్లీ నోమానీ వ సులైమాన్ నద్వీ, సీరతున్నబీ (స) –2వ భాగం, పేజ్ నెం. 216)


وَمَا أَرْسَلْنَاكَ إِلَّا رَحْمَةً لِّلْعَالَمِينَ

ఇప్పుడు నేను నా ఆల్బంలోని మరో భాగాన్ని తెరుస్తాను. ఇందులో మీకు ఎలాంటి దృశ్యం చూపిస్తానంటే, అందులో సందేశ ప్రచారకుడి జీవితపు రూపురేఖను చూడగల్గుతారు. ఇదే ఇక నేను చూపించే చివరి దృశ్యం.

పన్నెండవ దృశ్యం

నిరాడంబరతే నా జీవన మార్గం

హ(జత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) దృశ్యాన్ని వర్ణించారు. ఆయన ఇలా వివరించారు. నేను ఒకసారి దైవప్రవక్త (స) కొరకు ఆయన (స) నివాసమున్న గృహానికి వెళ్లాను. లోపలికి వెళ్లి చూస్తే ఇంట్లో ఉన్న వస్తు సామాగ్రి ఇలా ఉన్నాయి :

ఆయన (స) చాపమీద కూర్చుని ఉన్నారు. ఒంటిపై ఒక లుంగి మాత్రమే ఉంది. పట్టె మంచం ఒకటి వేసి ఉంది. దానిపై ఖర్జూరపు బెరడు నింపిన ఒక తలగడ ఉంది. ఒక మూల గుప్పెడు గోధుమలు పడి ఉన్నాయి. కాళ్లవద్ద ఒక పశువు చర్మం ఉంది. కొన్ని నీళ్ల తిత్తులు గోడకు వేలాడుతూ కనిపించాయి.

ఈ పరిస్థితిని చూసి హ(జత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు, నా నయనాల నుండి అశ్రువులు ప్రవహించసాగాయి. నా దుఃఖానికి కారణమేమిటని మహా ప్రవక్త (స) అడగ్గా, ఇలా విన్నవించుకున్నాను :

"ఓ దైవప్రవక్తా! ఏడవక మరేం చేయమంటారు? మీ వీపుపై మంచం నవారు గుర్తులు పడిపోయాయి. మీ శయనాగార స్థితి ఇంత దయనీయంగా ఉంది! రోము, ఇరాన్, సామ్రాజ్యాధిపతులైన ఖైసర్, కిస్రాలు ప్రాపంచిక సుఖభోగాలన్నింటినీ జుర్రుకుంటూ ఉండగా తమరు దైవప్రవక్త అయి ఉండి కూడా ఈ దయనీయ స్థితిలో ఉన్నారే!"

ఇది విని "ఓ ఖత్తాబ్ పుత్రుడా! –వాళ్లు ప్రపంచాన్ని పొందగా, మనం పరలోక సుఖాలను పొందడం నీకు ఇష్టం లేదా?' అని అన్నారు ప్రవక్త (స)

(షిబ్లీ నోమానీ వ సులైమాన్ నద్వీ, సీరతున్నబీ, 2వ భాగం పేజీ నెం. 307)

ప్రపంచంలోని ప్రతీ వస్తువు ఆయన (స)కు అందుబాటులో ఉన్నా

ఆయన (స) ఏమీ తీసుకోలేదు. ఆయన (స) వద్దకు కానుకలు బహుమానాల రూపంలో ఏమి వచ్చినా వాటిని అందరికీ ఇచ్చివేశారు. ఖైసర్, కిస్రాల వలే రేయింబవళ్లు సుఖభోగాలతో జీవనం గడిపే అవకాశమున్నా ఆయన (స) కడు బీదరికంతో తమ జీవితాన్ని అలంకరించుకున్నారు.

ఉల్లేఖనాల్లో ఆయన (స) స్వయంగా మంచి పదార్థాలు తిన్నారని, మంచి వస్త్రాలు తొడిగారని రుజువవుతుంది. నిప్పులలో కాల్చిన మాంసమంటే ఆయన (స) చాలా ఇష్టపడేవారు. అది దొరికినప్పుడల్లా ఆయన (స) ఎంతో ఇష్టంతో ఆరగించేవారు. సువాసనను (అత్తరు) ఎక్కువగా ఉపయోగించే వారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఇలా ఉల్లేఖించారు. "ఆయన (స)ను అత్యుత్తమ వస్త్రాలు ధరించి ఉండగా నేను చూశాను" (అబూదావూద్). హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఒక మారు బజారు నుండి సిరియా జుబ్బాను కొనుగోలు చేశారు. ఇంటివద్ద చూసుకుంటే అందులో ఎరుపురంగు చారలున్నాయి. తీసుకువెళ్లి దాన్ని వాపసు చేసివచ్చేశారు. ఒకరు ఈ వృత్తాంతాన్ని హజ్రత్ అస్మా (రజి) నుండి ఉల్లేఖించారు. ఆమె దైవప్రవక్త (స) వారి జుబ్బాను తెప్పించి ప్రజలకు చూపించారు. దాని జేబులకు, చేతుల మీద, అంచులపై పట్టు చారలున్నాయి". (అబూదావూద్) దైవప్రవక్త (స) వారి ప్రతి అనుచరుడి జీవితం ఇలాగే ఉండాలనేది తప్పనిసరి ఏమీ కాదు. అల్లాహ్ తన దాసుల కొరకు అలంకరణ వస్తువులను సృష్టిస్తే, వాటిని దైవప్రవక్త (స) ఎలా నిషేధించగలరు?

ఈ దృశ్యం అసలు రంగు ఏమిటంటే సత్యమార్గంపై నడవాలని, పర లోకాన్ని వశపరుచుకోవాలని గట్టిగా నిర్ణయించుకోవడం, దీని తర్వాత కనీసం ఎవరైతే ప్రపంచాన్ని అల్లాహ్ దాస్యంలోనికి తీసుకువచ్చే విప్లవాత్మక లక్ష్యంతో నడుకంట్టి ఉన్నారో వారు ఐహిక వాంఛలకు దూరంగా ఉండాలి. ఇవి పరలోకంలో నష్టదాయకమైనవి. అనగా ఇవి జీవితంలో ఇహలోకం కొరకు కొరకు పాటుపడే శ్రమ నష్టదాయకమన్నమాట. వీటిని హృదయం నుండి తీసిపారేయాలి.

అందువల్ల దృష్టి మరలకుండా చూసుకోమని తాకీదు చేశారు. కేవలం ఇహలోకానికే పరిమితమైన వారి జీవనశైలిని అనుసరించడం మొదలు పెట్టావేమో! వారు గొప్పగొప్ప అందమైన పాలరాతి భవనాలు, మనోహరమైన తోటలు, సోఫాలు, ఫర్నీచర్, ఎయిర్ కండీషనర్, బ్యాంక్ బ్యాలెన్స్ కలిగి ఉండవచ్చు. వీటిలో నుండి ఏ వస్తువూ నిషిద్ధమైనది కాదు. కాని వీటిలో నుండి ఏ వస్తువూ మీ లక్ష్యమూ కాదు, గమ్యమూ కాదు. ఒకవేళ వీటిలోని ఏ వస్తువు విలువ అయినా సత్యసందేశ ప్రచారంలో నష్టదాయకంగానూ, నిజమార్గంలో పనికిరాని వస్తువు గాని అయినట్లైతే అప్పుడు అది ధర్మసమ్మతం కాదు. దీనికంటే వీటి నుండి దృష్టి మరల్చుకోవడమే ఉత్తమమైన మార్గం.

ప్రపంచ జీవితపు శోభావైభవాలను కన్నెత్తి కూడా చూడకు. వాటిని మేము వారిని పరీక్షకు గురిచెయ్యటానికే ఇచ్చాము. (తాహా 20:131)

హృదయంలో అలంకరించుకోండి

నేను మీకు చూపించినవి నా ఆల్బంలోని 5 వేర్వేరు భాగాలకు చెందిన 12 దృశ్యాలు. ఈ దృశ్యాలన్నీ మీ ముందున్నాయి. మీరు వీటిని ఎంతో ఉత్సాహంతో మీ హృదయమనే ఫ్రేమ్‌లో అలంకరించుకోవాలని, ఎంతో శ్రద్ధగా వీటిని జాగ్రత్తపరుచుకోవాలని, మీ చెవులు, కళ్లు, మనస్సులపై ఈ దృశ్యాలు శాశ్వతంగా ముద్రించబడాలని నేను కోరుకుంటున్నాను. వీటిని ముందుంచుకుని మీరు మీ జీవితం వైపు దృష్టిసారించండి. మీ పద్ధతులు, మీ బలాలను చూసుకోండి. మీ వ్యవహారశైలి, గుణగణాలు, నడవడిక, కర్మలను పరిశీలించండి, అందువల్లనే ఇలా పేర్కొన్నారు. "లఖద్ కాన లకుమ్ ఫీ రసూలుల్లాహి ఉస్వతుల్ హసన." సమస్త సౌందర్యం దైవప్రవక్త (స) జీవితంలో క్రోడీకరించబడింది. ఎవరైతే సౌందర్యాన్ని అన్వేషిస్తున్నారో వారు ఆత్రుతల పాత్రలు తీసుకుని ఆయన (స) జీవితం వెంట బయలుదేరండి.

కేవలం వినిపించడానికో, చదివించడానికో లేదా రాయడానికో ఈ సౌందర్యాన్ని గురించి చర్చించడం లేదు. ఆలోచనల కెరటాలు హృదయంలో

ఉప్పొంగి, నయనాలు అశ్రుపూరితాలైపోతే సరిపోదు. ఇది మన ఆచరణల్లో ఏ విధమైన ప్రభావం చూపకుండా ఉండకూడదు. ఈ మూసలో మనం ఒదిగి పోవాలి. అది మన జీవిత లక్ష్యం కావాలి. ఈ నమూనాలోని ప్రతీ కోణం నుండి తొణికిసలాడే పద్ధతులు, విధానాలు, వీటితోపాటు అవే ఆచరణలను మనం కూడా అలవర్చుకోవాలి.

ఇంతగా ఆతృత, దృఢ సంకల్పం, బలమైన కోరికలు, శక్తిసామర్థ్యాలు, ధైర్యం, యోగ్యతలు జనించి మనం కూడా ఈ అత్యుత్తమమైన, ఆదర్శవంత మైన నమూనాను అనుసరించే మార్గం, విధానం ఏమిటి అని మీరు నన్ను అడగవచ్చు. మన జీవితంలో కూడా ఈ సౌందర్యం ఎంతోకొంత, ఏదో ఒక సమయంలో తొణికిసలాడుతుంది.

ఏ ఖుర్‌ఆన్ వాక్యం మొదటి భాగం ఈ నమూనాను సూచిస్తుందో ఆ ఖుర్‌ఆన్ వాక్యంలోని తర్వాతి భాగంలో మీ ప్రశ్నకు సమాధానం పొందుపరచ బడి ఉంది. మీరు వాక్యాన్ని పూర్తిగా చదివినట్లైతే అవగాహన చేసుకొన్నట్లయితే విషయం తేటతెల్లమయిపోతుంది. దీనిలో మీరు ప్రయాణం కొనసాగించాల్సిన ఆ మార్గాన్ని పొందుతారు.

దివ్యఖుర్‌ఆన్‌లో 'వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శ నమూనా ఉండినది; అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతీ వ్యక్తికి' అని పేర్కొనబడింది.

అల్లాహ్, అంతిమ దినంపై ఆశలు పెట్టుకోవడం, విశ్వసించడం, అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించడం – ఈ రెండు ఆచరణలు కలిగి ఉంటే మార్గం సుగమం అవుతుంది.

ఇక్కడ అల్లాహ్ అంతిమ దినాన్ని విశ్వసించడాన్ని గురించి చర్చించడంలేదు. ఇక్కడ పర్జూ అనే పదం ఉపయోగించారు. షరతులతో కూడిన విశ్వాసం కాక, ఆశతో కూడిన విశ్వాసం అవసరం ఉంది. అనగా ఆశలు, కోరికలు, ఆకాంక్షలు, లక్ష్యాలు, ఉద్దేశాలు, ఉరుకులు, పరుగులు అన్నీ అల్లాహ్, అంతిమ దినంపై నిల్చుని ఉండాలి.

మీరు దైవప్రవక్త (స) జీవిత చరిత్రను ఎంతగా విన్నా, ఎంతగా చదివినా మీ ఆత్మలకు కావలసిన ధైర్యం, దృఢ సంకల్పం, ఉత్సాహాలు మీ పూర్తి ఆశలనేవి ఇహలోకం నుండి తెంచి అల్లాహ్, అంతిమ దినంతో కలప కుండా, అనుక్షణం అల్లాహ్ సంస్మరణ చేయకుండా మీలో ఇవన్నీ జనించడం కష్టతరమవుతుంది.

'అల్లాహ్ సంస్మరణ' అనేది చాలా విస్తారమైనది. అల్లాహ్‌ను విశ్వసించడం, ఆయన తస్‌బీహ్ (నామస్మరణ) చేయుటం, ఆయన గుణగణాలను పొగడడం, ఆయన స్తోత్రం, ఆయనకు కృతజ్ఞతలు అర్పించుకోవడం, ఆయన ఏకత్వాన్ని విశ్వసించి ప్రకటించడం (ఈమాన్), ఆయన ముందు నిలబడటం (నమాజ్), ఆయన మార్గంలో సంపదను ఖర్చుపెట్టడం (జకాత్, సదఖా), ఆయన కొరకు ఆకలిదప్పులను (ఉపవాసం) సహించడం ఆయన గృహ ప్రదక్షిణం చేయటం (హజ్) – ఇవన్నీ అల్లాహ్ సంస్మరణ రూపాలు. మీరు ప్రజలను అల్లాహ్ దాస్యం వైపునకు పిలవడం, ఆయన సందేశాన్ని అందరి వరకూ చేర్చడం, ఆయన ధర్మాన్ని గురించి చర్చించడం, ఆయన కొరకు ఉరుకులు పరుగులు, బలిదానాలు ఇవ్వడం మొదలైనవి అల్లాహ్ సంస్మరణకు పరమార్థాలే.

క్రూరుడైన, దౌర్జన్యపరుడైన చక్రవర్తి దర్బారులో నిలబడి అతణ్ణి అల్లాహ్ దాస్యం వైపునకు పిలిచి, అల్లాహ్ దాసులను అతని బానిసత్వం నుండి విముక్తి ప్రసాదించడానికి హజ్రత్ మూసా (అ)ను ఫిరౌన్ దర్బారులోనికి పంపించాడు. అప్పుడు మూసా అలైహిస్సలాం తమ వద్ద వస్తు సామాగ్రి రాహిత్యం, నాలుక తడబాటు, బలహీనతలను పేర్కొంటూ నువ్వు నా హృదయాన్ని తెరువు, నా పనిని నా కొరకు సులభం చెయ్యి, నా నాలుక ముడిని విప్పు. ప్రజలు నా మాటలను అర్థం చేసుకోవడానికి అని ప్రభువుని వేడుకున్నారు. తర్వాత ఇలా విన్నవించుకున్నారు:

"నీ నామస్మరణ వేగవంతం చేసేందుకుగాను."

ఏ మూలనో కూర్చుని తస్బీహ్ పఠించడానికి ఆయన వెళ్లడం లేదన్నది ఇక్కడ తెలుస్తూ ఉంది. ఆయన ఒక క్రూరుడైన చక్రవర్తి దర్బారులో దైవ సందేశాన్ని ఇవ్వడానికి వెళ్తున్నారు. ఈ పని కొరకే ఆయన్ని తస్బీహ్, జిక్ర్ అనే పదాలను ఉపయోగించారు. అదే విధంగా అల్లాహ్ ఆయన్ని సంబోధిస్తూ ఇలా సెలవిచ్చాడు :

'చూడు, నువ్వు నా సంస్మరణలో నిర్లక్ష్యం వహించకు!' ఇక్కడ కూడా 'జిక్ర్' అనే పదం ఉంది. దీనిని బట్టి ఈ పదం 'దైవ సందేశం' అనే అర్థంలోనే వాడతారని స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

మరొకచోట గమనించండి, ఇక్కడ 'జిక్ర్' అనే పదంతో అల్లాహ్ మహోన్నతమైన శుభవార్తను ముడివేశాడు. ఇంకా ఇలా చెప్పారు :

"మీరు నన్ను స్మరించండి, నేను మిమ్మల్ని జ్ఞాపకముంచుకుంటాను" (2:152)

ఈ వాక్యాన్ని ఎంతో అందంగా ఖుర్ఆన్‌లో రెండు భాగాల మధ్యలో తీసుకువచ్చి పదిలపర్చారు. మొదటి భాగంలో 'ఖిబ్లా' మార్చమని ఆదేశించబడింది. ఇది అల్లాహ్ సందేశాన్ని మహోన్నత స్థాయికి చేర్చే ఒక నూతన సమాజం ఉనికిలోనికి రాబోతుందనే విషయాన్ని సూచిస్తుంది. తర్వాత దైవ ప్రవక్త (స)ను గ్రంథపారాయణం చేస్తూ, ప్రజలను పరిశుద్ధపరిచి, వారికి జ్ఞానాన్ని బోధించమని పేర్కొన్నాడు. దీని తర్వాత రెండవ భాగంలో సహనం, నమాజ్‌ల ద్వారా అల్లాహ్ సహాయాన్ని కోరమని ఆదేశించాడు. తర్వాత అల్లాహ్ మార్గంలో ప్రాణాలు అర్పించిన వారిని 'మృతులు' అనడం, భావించడం నుండి నిరోధించారు. దీని తర్వాత మేము మిమ్మల్ని భయం, ఆకలి, పంట నష్టాలు, ప్రాణ నష్టాల ద్వారా పరీక్షకు గురిచేస్తాం అని పేర్కొనబడింది.

ఈ రెండు భాగాల మధ్య ఈ వాక్యాన్ని పదిలపర్చారు. 'మీరు నన్ను స్మరించండి, నేను మిమ్మల్ని జ్ఞాపకముంచుకుంటాను, నాకు కృతజ్ఞతలు

తెలుపండి.' ఎందుకంటే నేను మీ కొరకు వివేచనం అనే తలుపును తెరిచివేశాను. ఈ మార్గంపై నడిచే సద్బుద్ధిని ప్రసాదించాను. ఈ ద్వారంలోనికి ప్రవేశించే మహాభాగ్యాన్ని ప్రసాదించాను. ఇది నా ఉపకారం. నువ్వు దీన్ని మర్చిపోయి, కృతఘ్నుడుగా మారకుండా ఉండు. నన్ను స్మరించు. ఈ సంస్మరణలోనే నీకు పరీక్షలు ఎదురవుతాయి, అప్పుడు సహనం వహించాల్సిన అవసరం ఏర్పడుతుంది.

ఇక్కడ మరో కోణాన్ని పరిశీలిస్తే హిరా గుహలో మొదటిసారిగా అవతరించిన దైవవాణి 'చదువు' సందేశాన్ని తీసుకువచ్చింది. రెండో దైవవాణి 'లే, లేచి హెచ్చరించు' ('ఖుమ్ ఫఅన్‌జర్') అనే ఆదేశం అవతరించింది. దీనికి ముందు నమాజ్, రోజా, జకాత్, హజ్ గురించి ఎలాంటి దైవవాణి అవతరించలేదు. మొదటి ఆదేశం 'చదువు' రెండో ఆదేశం లే, లేచి ప్రజలను అల్లాహ్ ధర్మం వైపునకు ఆహ్వానించు, వారిని హెచ్చరించాలనే ఆదేశాలు అవతరించాయి. దీనిద్వారా సత్య సందేశాన్ని అందించాలనేది ఎంత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయో స్పష్టమవుతుంది.

కుటుంబం, మన ఊరు, వీధి, కాలేజ్, యూనివర్శిటీ, సమాజంలో ఈ సందేశాన్నందించాలని ఉస్వాయెహసన (ఉత్తమ నమూనా) యొక్క ఈ ఆదర్శ దృశ్యాలు పిలుపునిస్తున్నాయి, వీరందరి విషయంలో సాక్ష్యమివ్వాలని హెచ్చరిస్తున్నాయి.

అల్లాహ్ సందేశాన్నందించే బృహత్తర బాధ్యత, జవాబుదారీతనం మన మనోమస్తిష్కాలలో జనింపచేసుకోవాలి. సత్యసందేశాన్నందించే ధ్యాసలోనే మన రాత్రింబవళ్లు గడవాలి. మనస్సు లగ్నం చేసి ప్రేమతో ఈ కార్యాన్ని నెరవేర్చాలి. దైవాన్ని, దైవప్రవక్తను ప్రగాఢంగా ప్రేమించాలి. అల్లాహ్ మార్గంలో కృషిచేసేవారి పట్ల ప్రేమవాత్సల్యాలతో మసలుకోవాలి.

అల్లాహ్ మనందరిని ప్రియప్రవక్త (స) అడుగుజాడల్లో నడిచే సౌభాగ్యాన్ని కలుగజేయు గాక (ఆమీన్)